www.prajadeevena.com


ప్రజా దీవెన

సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

నల్లగొండ | సంపుటి : 11 | సంచిక : 352 | శనివారం | 24 అక్టోబర్ 2026 | పేజీలు : 04 వెల ₹ 5

"నా బాధకు కారణం ఆ వ్యక్తే" అ ని అనడం వల్ల కర్మ కొనసాగు తూనే ఉంటుంది, ఎందుకంటే ఆ భావన మీ మనస్సులో అలాగే ఉండిపోతుంది.మీరు ఎందుకు మీ అంతరాత్మలోకి తొంగి చూ డటం లేదు? ఎందుకు గతాన్ని వదిలి ముందుకు సాగడం లేదు? గతంలో జరిగిన ఒక సంఘటన ను పట్టుకుని, మీ కర్మకు మరొక రిని ఎందుకు నిందిస్తున్నారు?ఇలాగే కొనసాగితే, మీరు దుఃఖంలోనే ఉ ంటారు.మీ చింత ల న్నింటినీ నాపై వదిలేయండి. ఎవ రి గురించో, మీ ఉద్యోగం గురిం చో, లేదా మరేదో విషయం గు రించో ఆందోళన చెందడం వ్య ర్థం. చింతించడం వల్ల మీకు ఏ మీ దక్కదు. "నాకు కావలసినది నాకు లభిస్తుంది" అనే ఆత్మవి శ్వాసంతో ముందుకు సాగండి. ప్రతి ఒక్కరి జీవితంలోనూ సవా ళ్లు ఎదురవుతుంటాయి; కానీ వాటిని దాటి ముందుకు వెళ్లండి, అన్నీ సర్దుకుంటాయి.

- గురుదేవ్ శ్రీ శ్రీ రవి శంకర్ జీ



కరువు కరతాళనృత్యం

వచ్చేవర్షాకాలం నాటికి అంతే సంగతులు

కరోనాలాంటి విపత్తులో పాదుపు చర్యలే అనివార్యం

సాగునీరు దేవుడేరుగు తాగునీటి మాత్రం తంటాలు తథ్యం

రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులు

ఎండాకాలం తాగడానికి చుక్కనీరు దొరక్కపోవచ్చు

ఈ పరిస్థితిని దాచితే క్యాన్సర్‌లా తయారవుతుంది

రానున్న ముప్పును ప్రజలందరికీ వివరించండి

నాటి విపత్కరం కరోనా.. నేటి విపత్కరం ఎల్‌నినో

కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు చేస్తున్న

తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలి

మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,

కాంగ్రెస్ ముఖ్య నేతలతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి



ప్రజా దీవెన, హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో చిన్నగా మొదలైన కరువు సమస్య.. కొనసాగనుందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ కరువు ప్రభావంతో రానున్న 9 నెలలూ అత్యంత ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనబోతున్నామని చెప్పారు. వేసవికాలంలో బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడతాయని, తాగటానికి చుక్క నీరు కూడా దొరకని పరిస్థితి రాబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిజాన్ని దాచి పెడితే

మిగతా 2 లో

యాదాద్రి పవర్ ప్లాంట్ అవినీతిమయం

వారిద్దరినీ గుంజకు కట్టి కొట్టాలి

బొగ్గు లేనిచోట ప్రాజెక్టు కట్టి వ్యయాన్ని రూ.9,800 కోట్లు పెంచారు

మేము అధికారంలోకి వచ్చాకే ఒడిసా నుంచి బొగ్గు లింకేజీ ఏర్పాటుచేశాం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

02

నక్సల్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

నేరాల నియంత్రణకు సమష్టి కృషి అవసరం

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం

దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

02

ఏడుల నుంచే వివాదానికి ముగింపు

అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి కూడా..

పాలమూరు నీటికి గండి పడకుండా అదనంగా శ్రీశైలం నుంచి ఏదుల వరకు 0.6 టీఎంసీల ఎత్తిపోత

నీటి తరలింపు సమస్యకు సీఎం పరిష్కారం

ఇరిగేషన్ ప్రాజెక్టులపై సమీక్షలో ప్రతిపాదన

తుమ్మిడిహెట్టి బ్యారేజీపై త్వరలోనే మహారాష్ట్రతో చర్చలు

152 మీటర్ల ఎత్తు బ్యారేజీకి ఒప్పించేలా వాదనలుండాలన్న ముఖ్యమంత్రి



ప్రజా దీవెన, హైదరాబాద్ : డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని ఎక్కడి నుంచి తరలించాలనే ఉత్కంఠకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెరదించారు. ఈ అంశంపై ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల ప్రజాప్రతినిధుల మధ్య నెలకొన్న వివాదానికిముగింపు పలుకుతూ పరిష్కారం దిశగా నిర్ణయం తీసుకున్నారు. డిండి ప్రాజెక్టుతోపాటు అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి కూడా ఏదుల రిజర్వాయర్ నుంచే నీటిని తీసుకోవాలని నిర్ణయించారు. ఏదుల రిజర్వాయర్ నుంచి డిండి ప్రాజెక్టుకు 0.5 టీఎంసీలు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. శుక్రవారం డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, రాజ్యసభ

మిగతా 2 లో



సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

విభజన శక్తులకు వ్యతిరేకంగా ఏకమవ్వాలి

సవాళ్లను ఎదుర్కొనేందుకు మరింత చురుగ్గా ఉండాలి

యువత భాగస్వామ్యంతో బలమైన భారత్‌ను నిర్మించాలి

'చిన్మయ మిషన్' సమ్మేళనంలో ప్రధాని మోదీ పిలుపు

విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజం అంతా ఒక్కటవ్వాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రజల్లో స్వావలంబనపై అవగాహన పెంచడంతోపాటు దేశంలోని ప్రతి ఒక్కరినీ 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంతో అనుసంధానించాలని చెప్పారు.

04

ఏడాదిలో రేవంత్ పాలన పాతర

ఆయనకు ఓటేయాలని ప్రజలకు ఆతృత

దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకం!

కాంగ్రెస్, బీజేపీయేతర శక్తులు ఏకం కానున్నాయి

రాహుల్‌కి ఎన్ని జాకీలు వేసినా నిష్ప్రయోజనం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



3

భయపెడుతున్న రేవంత్ భరతంపడతారు ప్రజలు

ఆరు నెలలుగా కరువు సంగతి తెలీలేదా?

సీఎంగా కేసీఆర్ ఉంటే కరువు తాకేదే కాదు

ప్రజాక్షేత్రంలో రేవంత్‌రెడ్డికి శిక్ష తప్పదు

హరీష్ రావు ఆగ్రహం



సరిహద్దులో మళ్లీ సమస్యలు

భారత్-చైనా సైనికుల మధ్య ముఖాముఖి..!

2

డ్రోన్లను మోహరించిన ఐటీబీపీ దళాలు

ఎస్ఏసీ వెంబడి బంకర్ల నిర్మాణం కూడా

చైనాతో ముఖాముఖి తలపడే అవకాశం

కరువు కరతాళనృత్యం

మొదటి పేజీ తరువాయి

క్యాన్సర్‌లా బాధపడాల్సి వస్తుందని, అందుకే దాచకుండా ప్రజలకు చెప్పాలని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ ముఖ్యనాయకులకు సూచించారు. శుక్రవారం వారితో ప్రజాభవన్‌లో ఎల్‌నినో పరిస్థితులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, ఢిల్లీలో ఎస్ఐఆర్ వ్యతిరేక ర్యాలీకి సన్నద్ధతపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై గత ఆరు నెలల నుంచీ ప్రజల్ని అప్రమత్తం చేస్తూ వస్తున్నామని గుర్తు చేశారు. "ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు రాజకీయ దురుద్దేశంతో కూడిన ప్రకటనలు చేస్తున్నడు. యూకేతో సహా ప్రపంచంలోని వంద దేశాల్లో ఎల్‌నినో ప్రభావం ఉంది. ఒక్కో ఊరు.. ఒక్కో మండలం, ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలాగా దీని ప్రభావం ఉండవచ్చు. తెలంగాణలోనే ఉత్తర తెలంగాణలో ఒకలాగా.. దక్షిణ తెలంగాణలో మరోలా ఉంది. ఏపీలో ఒకలా, మహారాష్ట్రలో మరోలా, కేరళ, కర్ణాటక, తమిళనాడుల్లో ఇంకో రకంగా ఉంది. ఈ వంద దేశాలకు, ఇన్ని రాష్ట్రాలకు చెందిన వారంతా హరీశ్‌రావు కంటే తెలివి తక్కువోళ్లా? గత 75 ఏళ్లలో చూడని కరువు ఇది. అత్యంత అభివృద్ధి చెందిన దేశాలూ ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. మహారాష్ట్రలోని కచ్ ప్రాంతంలో ఇప్పటికే ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తూ.. అందులోనూ రేషన్ విధానం పెట్టారు. ప్రతి మనిషీ తన నీటి వినియోగం కనీసంగా 20 శాతం తగ్గించుకోవడం తప్పనిసరి చేస్తూ మార్గదర్శకాలను రూపొందిస్తున్నారు" అని సీఎం రేవంత్ వివరించారు.



తాగునీటికీ కటకట తప్పదు..

ఎల్‌నినో ప్రభావంతో ఎండ వేడిమి పెరిగి.. ఉన్న నీరు ఆవిరి అవుతూ ఉంటుందని, సాగునీటి మాట అటుంచి తాగునీటికి కటకట ఏర్పడుతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు అవగాహన కల్పించకుండా కరువు పరిస్థితిని ఎదుర్కొనడం అసాధ్యమన్నారు. అందుకే ఈ అంశాన్ని శాసనసభలో చర్చకు పెట్టడమే కాకుండా మంత్రివర్గ ఉపసంఘాన్నీ వేశామని తెలిపారు. గతంలో కరోనాపై కేసీఆర్ బాధ్యత లేని మాటల వల్లే వేలాది మంది చనిపోయారని రేవంత్ ఆరోపించారు. కరోనా వచ్చినప్పుడు ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ బాధ్యత లేకుండా వ్యవహరించారన్నారు.

"శాసనభలో కరోనాపై చర్చ సందర్భంగా 30 డిగ్రీల ఎండ కొడితే కరోనా చచ్చి ఊరుకుంటదని, ఎక్కువైతే పారాసిటమాల్ వేసుకుంటే పోతుందంటూ కేసీఆర్ దబాయించి మాట్లాడిండు. చివరకు ఏమైంది? లక్షల మంది చనిపోయారు. కరోనాతో చనిపోయిన వారిని దహనం, ఖననం చేయడానికి స్మశానాల్లో చోటు దొరకని పరిస్థితి ఏర్పడింది. కేసీఆర్‌ను దైవాంశ సంభూతుడని బావించి.. కరోనాపై ఆయన బాధ్యత లేని మాటలను నమ్మి బయటికి వెళ్లినవారు స్మశానానికి వెళ్లారు. నమ్మని మనం.. ఇక్కడ సమావేశంలో కూర్చుని మాట్లాడుకుంటున్నం" సీఎం వ్యాఖ్యానించారు. అలాగే.. ఇది కాంగ్రెస్ తెచ్చిన కరువంటూ హరీశ్‌రావు చెప్పిన మాటలు నమ్మి.. సాగునీరు వస్తుందని ఊహించుకుని పంటలు వేస్తే రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు సూచించారు. సిద్ధాంతాలు వేరైనా కరోనా సమయంలో ప్రధాని మోదీకి అందరమూ సహకరించామని గుర్తు చేశారు. వ్యాక్సిన్ వచ్చాక ఆ ఉపద్రవం నుంచి బయటపడ్డామన్నారు. ఆనాడు ప్రకృతి సృష్టించిన విపత్కర పరిస్థితి కరోనా అయితే.. ఈనాటి విపత్కర పరిస్థితి ఎల్‌నినో కరువన్నారు. కరువు, విద్యుత్తు విషయంలో తమ ప్రభుత్వం అద్భుతంగా పనిచేసిందని సీఎం రేవంత్ అన్నారు. అయితే ఈ అద్భుత విజయాన్ని చెప్పుకోవడంలో వెనుకాముందు అవుతున్నామన్నారు. ఈ సీజన్‌లో ఎప్పుడూ రాష్ట్రంలో 14 వేల మెగావాట్లకు మించి విద్యుత్తు వినియోగం జరగలేదని, కానీ.. ఈ ఏడాది 20 వేల మెగావాట్ల పైచిలుకు విద్యుత్తు వినియోగం జరిగిందని తెలిపారు. ఏకంగా 20 శాతం వినియోగం పెరిగినా.. అప్పులు తెచ్చి, రకరకాల ప్రయత్నాలు చేసి రైతులకు విద్యుత్తు అందించగలిగామని, వానాకాలం పంటలను బయట పడేయగలిగామని చెప్పారు. సీజన్‌కు ముందే 33 సన్న వరి రకాలకు బదులు.. డిమాండ్ ఉన్న ఏడు సన్న వరి రకాలకు మాత్రమే బోనస్ ఇస్తామని ప్రకటించామని, ఈ విషయంలోనూ తమను బదనాం చేసేందుకు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నించారని అన్నారు. అయితే ప్రస్తుతం డిమాండ్ ఉన్న ఏడు సన్న వరి రకాలకు మార్కెట్లో క్వింటాలుకు రూ.3,500 నుంచి రూ.4,500 వరకు ధర పలుకుతోందని, ఇతర రాష్ట్రాల నుంచే వ్యాపారులు వచ్చి రైతులకు అడ్వాన్సులు ఇచ్చి పోతున్నారని తెలిపారు. మద్దతు ధర, బోనస్ ఇచ్చి కొందామన్నా ప్రభుత్వానికి ఆ ఏడు సన్నరకాలు దొరకడం లేదన్నారు. "సన్నబియ్యం ధర పెరగడానికీ కాంగ్రెస్సే కారణమని హరీశ్‌రావు అంటున్నడు. క్వింటాలు రూ.4,500 పెట్టి కొన్నవాడు లాభం వేసుకునే అమ్ముతడు కదా? బియ్యం ధర ఆటోమేటిక్‌గా పెరుగుతది కదా? ఈ మాత్రం అవగాహన హరీశ్‌కు లేదా?" అని మండిపడ్డారు.

సాగుకు నీరు అసాధ్యం!

కరువు పరిస్థితుల్లో సాగుకు నీరు, నిరంతరంగా విద్యుత్తు ఇవ్వడం అసాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం 30 లక్షల వరకు బోరుబావులు ఉంటే అందులో సగం బోరుబావులు ఇప్పటికే ఎండిపోయాయన్నారు. అప్పో.. సప్పో చేసి వ్యవసాయానికి విద్యుత్తు ఇచ్చినా.. పంట పొట్టకు వచ్చేనాటికి భూమిలో నీళ్లు ఉండవన్నారు. కృష్ణా రిజర్వాయర్లలో 20 శాతం మేరకు కూడా నీటి నిల్వలు లేవని, ప్రాజెక్టుల్లో నీళ్లు డెడ్ స్టోరేజీలో ఉన్నాయని తెలిపారు. వచ్చే ప్రతి చుక్క నీటినీ ఒడిసి పట్టుకుని తాగునీటి అవరాలు తీర్చుకోవడం తప్ప ఇంకో అవకాశమే లేదన్నారు. ఈ సమస్యకు వచ్చే జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షపాతం నమోదైతే తప్ప.. పరిష్కారం దొరకదన్నారు. అప్పుడూ వర్షాలు పడకుంటే కొత్త సమస్య మొదలవుతుందన్నారు. చిన్నపాటి నీటి వనరులు ఉంటే ఆరుతడి పంటలు, కూరగాయలు పండించుకోవాలని రైతులకు సూచించారు. రైతు వేదికల వద్ద ప్రతి 15 రోజులకోసారి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఈ పరిస్థితిని వివరించాలని మంత్రి తుమ్మలకు సూచించారు. విద్యుత్తు కొందామన్నా మార్కెట్లో అందుబాటులో లేదని, అందుకే ఈ విషయంలో స్వీయ నియంత్రణ ఉండాలని సీఎం అన్నారు. అవసరం లేకపోతే పగలు ట్యూబ్‌లైట్లు వేసుకోవద్దని, ప్రభుత్వ ఆఫీసుల్లో ఏసీలు తగ్గించుకుని పొదుపు మంత్రాన్ని పాటించాలని సూచించారు.

విమర్శలు విచారకరం: భట్టి

ఎల్‌నినో విపత్కర పరిస్థితుల్లో ప్రజలను అప్రమత్తం చేయడం అందరి బాధ్యత అని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ప్రజలకు అండగా నిలవాల్సిన సమయంలో బీజేపీ-బీఆర్ఎస్ విమర్శలు చేయడం విచారకరమన్నారు.

ఓటర్ల నమోదులో ఇంత జాప్యమా?

ఇంకా 64 శాతం ఓటర్ల నమోదు పెండింగ్‌లోనే..

ఇలా అయితే ఎలా గెలుద్దామనుకుంటున్నారు?

సానుభూతిపరులను వేగంగా నమోదు చేయించాలి

రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఓటర్ల నమోదుపై సీఎం రేవంత్ సూచన

బీఆర్ఎస్, బీజేపీ మధ్య చీకటి ఒప్పందాలు

కాంగ్రెస్‌ను దొంగ దెబ్బ తీయడానికి కుట్రలు

ప్రధాని మోదీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

నవంబర్ 1న ఢిల్లీలో జరిగే ఉద్యమంలో

తెలంగాణ తడాఖా ఏంటో చూపిద్దాం

15 వేల మందికి పైగా వెళదాం: రేవంత్

ప్రజా దీవెన, హైదరాబాద్: మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్, వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో ఓటర్ల నమోదును వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి.. కాంగ్రెస్ నేతలకు, ఆయా జిల్లాల ఇన్‌చార్జులకు సూచించారు. రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం ఓటర్ల నమోదు చాలా తక్కువగా జరిగిందని,. ఇలా అయితే ఎలా గెలుద్దామనుకుంటున్నారని ప్రశ్నించారు. శుక్రవారం ప్రజాభవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో మంత్రులు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో సీఎం మాట్లాడారు. 2021లో మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో 5,31,268 ఓట్లు ఉన్నాయని, ప్రస్తుతం 1,91,365 ఓట్లే నమోదయ్యాయని అన్నారు. అప్పటి ఓట్లతో పోల్చుకుంటే ప్రస్తుతం 36 శాతమే నమోదయ్యాయన్నారు. ఇక వరంగల్-ఖమ్మం-నల్లగొండ గ్రాడ్యుయేట్ స్థానంలోనూ 2021లో 5,05,565 ఓట్లు ఉంటే, ప్రస్తుతం 2,44,349 (49 శాతం) మాత్రమే నమోదు చేశారని తెలిపారు. ఈ రెండు స్థానాల్లో 7 లక్షల ఓట్లను టార్గెట్‌గా పెట్టుకుని నమోదు చేయించాలని సూచించారు. అయితే ఎవరిని పడితే వారిని ఓటర్లుగా నమోదు చేయించకూడదని, అలా చేయిస్తే.. ఇటీవల తమిళనాడులో జరిగినట్లుగా జరుగుతుందని అన్నారు. అక్కడ డీఎంకే కష్టపడి అందరినీ ఓటు వేసేందుకు పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్తే.. వాళ్లంతా విజయ్‌కు ఓటేశారని చెప్పారు. పార్టీ సానుభూతిపరులనే తీసుకెళ్లాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థులను ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సీడబ్ల్యూసీ ఖరారు చేసిందని, హైకమాండ్ నిర్ణయం తీసుకున్నాక వాదనలకు ఆస్కారం లేదన్నారు. వారిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందాలు..

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు రెండూ కలిసి కాంగ్రెస్‌ను దొంగ దెబ్బ తీయడానికి కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ ఆరోపించారు. ఇందుకోసం చీకటి ఒప్పందం చేసుకుంటున్నాయన్నారు. పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ ఎన్నికల్లో 66 శాతం, మున్సిపల్ ఎన్నికల్లో 85 శాతం గెలిచామని, సమన్వయంతో పనిచేసినందునే పంచాయతీలు, మున్సిపాలిటీల్లో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లోనూ అలాగే గెలిచామన్నారు. ఆ రెండు ఉప ఎన్నికల్లో కేటీఆర్ డబ్బులిచ్చి బెట్టింగ్ కూడా కట్టిచ్చారని, అయినా కాంగ్రెస్సే గెలిచిందని అన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను అభ్యర్థులకే వదిలేయకుండా.. పార్టీ భుజాలపై మోయాలని, గెలుపు సాధించాలని సూచించారు. ఎన్నికలు లేని జిల్లాల వారికీ కొంత బాధ్యత ఇస్తామని, కార్యాచరణను పార్టీ తెలుపుతుందని చెప్పారు.

ఎస్ఐఆర్ ద్వారా గెలవాలనుకుంటున్నారు..

ప్రధాని నరేంద్రమోదీ.. కులం, మతం, ప్రాంతం, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్ పేరుతో భయపెట్టి, బెదిరించి రాష్ట్రాలను, కేంద్రాన్ని గెలుస్తూ వచ్చారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. అయితే ఇప్పుడు దేశంలో నిరుద్యోగ సమస్య తాండవం చేస్తోందని, ఓటుహక్కు అంశంపై మోదీపై జెన్-జీల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని తెలిపారు. దీంతో మోదీ అధికారం జెన్‌జీ ఎదుట జంతర్ మంతర్ వద్ద తలొగ్గాల్సిన పరిస్థితి వచ్చిందని, అందుకే ఈసారి ఎస్ఐఆర్ ద్వారా గెలవాలనుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో ఓటుహక్కు ఉన్న ఆగర్భ శ్రీమంతులు, ఓటు హక్కు లేని దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మహిళలు అనే రెండు తరహాల్లో పౌరులను తయారు చేస్తున్నారని రేవంత్ ధ్వజమెత్తారు. వీరంతా మోదీకి వ్యతిరేకంగా ఉన్నందునే వారి ఓట్లు తొలగించి.. ఓటు ఉన్న శ్రీమంతులతో గెలవాలనే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. మోదీ మూడోసారి ప్రధాని అయిన ఎన్నికల సమయంలో ఉన్న 97 కోట్ల ఓట్లలో ఇప్పటికే దాదాపు 13 కోట్ల ఓట్లను తొలగించారని తెలిపారు. దాంతో దేశంలో ఓట్ల సంఖ్య 84 కోట్లకు పడిపోయిందన్నారు. 140 కోట్ల జనాభా ఉన్న ప్రస్తుత సమయంలో నాలుగోసారి ప్రధాని కావడానికి 80 కోట్ల లోపు ఓట్లకు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. బెంగాల్ తరువాత తెలంగాణ అని బీజేపీ నేతలు అంటున్నారని, తెలంగాణకు ఏమిచ్చారని వస్తారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఏమి చేశారని బీజేపీకి ఓటేస్తారని అన్నారు. ఎస్ఐఆర్‌ను సాకుతో వద్దామనుకుంటున్నారని విమర్శించారు.

రామ్‌లీలా మైదానంలో తెలంగాణ తడాఖా చూపిద్దాం

"వందేళ్ల క్రితం జరిగిన 'సైమన్ గో బ్యాక్'పై తిరుగుబాటు తరహాలోనే ఇప్పుడు బ్రిటిష్ జనతా పార్టీ (బీజేపీ) ద్వారా వచ్చిన జ్ఞానేశ్ కమిషన్‌ను 'జ్ఞానేష్ గో బ్యాక్' అంటున్నాం" అని సీఎం రేవంత్ అన్నారు. ఈ నినాదంతో నరేంద్రమోదీ నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు రాహుల్‌గాంధీ పెద్ద కార్యక్రమం తీసుకున్నారని చెప్పారు. "నవంబరు 1న రామ్‌లీలా మైదానంలో జరిగే ఉద్యమానికి మనవంతు భాగస్వామ్యం కావాలి. తెలంగాణ నుంచి 15 వేల మంది రావాలన్నారు. వాళ్లు అడిగిన దానికంటే ఎక్కువే వెళ్లాలి. ఆ రోజు మన తడాఖా చూపిద్దాం. మన గళం-బలం చూపిద్దాం" అని సీఎం పిలుపునిచ్చారు. ఆ గర్జనతో ఢిల్లీలోని ఎర్రకోటపై కాంగ్రెస్ జెండాను ఎగరవేయించాలన్నారు.

జయప్రదం చేద్దాం: మహేశ్

నవంబరు 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న మెగా ర్యాలీని విజయవంతం చేయాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ర్యాలీకి పెద్ద సంఖ్యలో జన సమీకరణ చేయాలన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సమావేశంలో సూచించారు.

మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో ప్రజాప్రతినిధులు

దేశవ్యాప్తంగా 187 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై కేసులు

14 మందిపై ఏకంగా అత్యాచార ఆరోపణలు

జాబితాలో తెలంగాణ ఎంపీ!

తెలంగాణలో ఐదుగురు, ఏపీలో 22 మందిపై అభియోగాలు

ఐదుగురు కేంద్ర మంత్రులపైనా కేసులు: ఏడీఆర్ నివేదిక

న్యూఢిల్లీ, అక్టోబరు 23: చట్టసభల్లో మహిళల రక్షణపై గళమెత్తాల్సిన ప్రజాప్రతినిధులపైనే తీవ్రమైన నేరారోపణలు నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా ఏకంగా 187 మంది ప్రజాప్రతినిధులపై మహిళలపై అఘాయిత్యాలు, వేధింపులకు సంబంధించిన కేసులు ఉన్నట్లు అసోషియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) తన నివేదికలో వెల్లడించింది. మొత్తం 4,881 మంది సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అత్యాచారం, మహిళల గౌరవానికి భంగం కలిగించడం, వేధింపులు వంటి నేరారోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల వివరాలతో ఏడీఆర్ శుక్రవారం ఒక నివేదిక విడుదల చేసింది. ఈ జాబితాలో 19 మంది ఎంపీలు, 168 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరిలో 14 మంది ప్రజాప్రతినిధులపై (12మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు లోక్‌సభ ఎంపీలు) నేరుగా అత్యాచారం కేసులు ఉండటం గమనార్హం. ఐదుగురు కేంద్ర మంత్రులపై కూడా మహిళలపై నేరాలకు సంబంధించి ఆరోపణలు ఉన్నాయని నివేదిక స్పష్టం చేసింది. రాష్ట్రాల వారీగా చూస్తే, మహిళలపై నేరాల కేసులున్న ప్రజాప్రతినిధుల జాబితాలో పశ్చిమ బెంగాల్ 69 మందితో మొదటి స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ 22మందితో (21 మంది ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ) రెండో స్థానంలో నిలిచింది. ఒడిశా 17 మంది ప్రజాప్రతినిధులతో మూడో స్థానంలో ఉంది. తెలంగాణలో మొత్తం ఐదుగురిపై (ముగ్గురు లోక్‌సభ ఎంపీలు, ఇద్దరు ఎమ్మెల్యేలు) కేసులు ఉన్నాయి. పార్టీల వారీగా చూస్తే బీజేపీ 106 మంది(95 ఎమ్మెల్యేలు, 11 మంది ఎంపీలు)తో అగ్రస్థానంలో నిలవగా, 20 మంది(19 ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ)తో కాంగ్రెస్ రెండో స్థానంలో, 18 మంది(17 ఎమ్మెల్యేలు, ఒక ఎంపీ)తో టీడీపీ మూడో స్థానంలో నిలిచింది. కాగా, బీజేపీకి చెందిన 11 మంది ఎంపీలలో ఐదుగురు కేంద్ర మంత్రులు ఉన్నారు. వీరిలో ఒక మంత్రి తెలుగు రాష్ట్రాలకు చెందినవారు కావడం గమనార్హం.

తెలుగు రాష్ట్రాల్లో కేసుల వివరాలు..

తెలంగాణ నుంచి బీజేపీకి చెందిన ముగ్గురు ఎంపీలపై కేసులు నమోదు కాగా, అందులో తొలిసారి గెలిచిన సిట్టింగ్ ఎంపీపై అత్యాచారం కేసు ఉంది. ఇక ఏపీలో కూటమికి చెందిన నలుగురు మంత్రులపై కూడా కేసులు నమోదవగా.. ఒక వివాదస్పద ఎమ్మెల్యేపై అత్యాచారం కేసు ఉంది. ఇటీవల కూటమి నుంచి రాజ్యసభకు ఎన్నికైన ఒక యువ ఎంపీతో పాటు రాష్ట్రంలో రాజ్యాంగ పదవిలో ఉన్న ఒక సీనియర్ నేతపై కూడా అభియోగాలు ఉండటం గమనార్హం. నేర చరిత్ర, ప్రత్యేకించి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారికి రాజకీయ పార్టీలు టికెట్లు ఇవ్వడాన్ని ఏడీఆర్ తీవ్రంగా ఆక్షేపించింది. వారిని ఎన్నికల్లో పోటీకి శాశ్వతంగా అనర్హులుగా ప్రకటించాలని, క్రిమినల్ నేపథ్యం ఉన్న ప్రజాప్రతినిధుల కేసులను వేగవంతం చేసి సత్వరమే విచారించాలని విజ్ఞప్తి చేసింది.

సౌదీలో ఇరుక్కుపోయిన మక్కా యాత్రికులు

హౌతీ ఉగ్రదాడులతో ఇక్కట్లు

తెలుగు రాష్ట్రాలవారే అధికం.. తిండి, వసతికి ఇబ్బందులు

రంగంలోకి ఏపీ ప్రభుత్వం

బాధితులను స్వదేశానికి రప్పించే ప్రయత్నాలు

జీవితకాలంలో ఒక్కసారైనా మక్కా దర్శనానికి వెళ్లాలన్న వారి ఆశలపై విధి పగబట్టింది. హౌతీ ఉగ్రదాడుల నేపథ్యంలో ఇలా సౌదీలో వేలాదిమంది భారతీయ ఉమ్రా యాత్రికులు చిక్కుకుపోయారు. తినడానికి తిండి, ఉండడానికి వసతి కూడా లభించక నానా ఇక్కట్లు పడుతున్నారు. వీరిలో వీరిలో క్యాన్సర్‌తో జీవనర్మణ పోరాటం చేస్తున్న ఖమ్మం జిల్లాకు చెందిన ముజీబ్ ఇమ్రాన్ అనే 32 ఏళ్ల యువకుడు, సరిగ్గా నడవలేని స్థితిలో ఉన్న కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన బస్సామ్మా బేగం అనే వృద్ధురాలు, ఏడాదిన్నర చిన్నారి రయ్యాన్.. ఇలా ఎందరో ఉన్నారు. హౌతీ దాడుల నేపథ్యంలో సౌదీ అరేబియాకు భారతీయ విమాన సంస్థలు అకస్మాత్తుగా విమానాలను తాత్కాలికంగా నిలిపివేయడంతో వీరంతా ఇబ్బందుల్లో పడ్డారు. కొందరు అధిక మొత్తంలో డబ్బు సర్దుబాటు చేసుకుని తిరిగి స్వదేశానికి వెళ్లిపోయారు. కొందరు మాత్రం పొరుగున ఉన్న బహ్రెయిన్ వెళ్లి అక్కడి నుంచి మాతృభూమికి చేరుకోగా, అనేకులు మాత్రం సౌదీలోనే చిక్కుకుపోయారు. ఇలా 3వేల మంది యాత్రికుల్లో తెలుగు రాష్ట్రాలకు చెందినవారే అధికంగా ఉన్నారు. వీరిలో అత్యధికులు మహిళలు, రోగులు ఉన్నారు. చివరి క్షణంలో విమానాలు రద్దు కావడంతో వీరిని మక్కాకు తీసుకెళ్లి లాడ్జిలలో ఉంచగా, వాటిని ఖాళీ చేయాలంటూ యాజమాన్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. ఏపీకి చెందిన సుమారు 60మందికి మక్కాలోని నిజాం రుబాత్ అనే ధర్మసత్రంలో వసతి కల్పించారు. కాగా, ఏపీ యాత్రికులను తిరిగి రప్పించే విషయమై అమరావతిలోని రాష్ట్ర ప్రభుత్వ యంత్రాగం శుక్రవారం రంగంలో దిగింది. వివరాలను తెప్పించుకుంటూ వీలైతే ప్రత్యేక చార్టర్ విమానాన్ని నడిపే దిశగా యోచిస్తున్నట్లు సమాచారం.

మహారాష్ట్రలో మహిళా డాక్టర్‌పై దాడి

మహారాష్ట్రలో ఓ మహిళా డాక్టర్‌పై దాడి ఘటన ప్రస్తుతం కలకలం రేపుతోంది. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. తాలేగావ్ శ్యామ్‌జీపంత్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. మెడికో లీగల్ కేసుకు సంబంధించి పోలీసులు వైద్య పరీక్ష కోసం తీసుకొచ్చిన ఓ వ్యక్తి అక్కడి మహిళా డాక్టర్‌పై అకస్మాత్తుగా చేయి చేసుకున్నాడు. ఇలా ఎందుకు చేశాడనేది మాత్రం తెలియరాలేదు. వీడియోలో కనిపించిన దాని ప్రకారం, వైద్య పరీక్షలు పూర్తయ్యాక ఆ డాక్టర్ సంబంధిత డాక్యుమెంట్స్‌పై సంతకాలు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. పోలీసులు తీసుకువచ్చిన వ్యక్తి ఆమె ఎదురుగా కూర్చున్నాడు. పక్కనే ఓ పోలీసు కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఆ డాక్టర్ సంతకాలు చేయమని ఆ వ్యక్తికి పెన్ను ఇచ్చారు. సంతకం చేసిన తరువాత అతడు అకస్మాత్తుగా డాక్టర్‌పై చేయి చేసుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసు అతడిని నిలువరించి గది నుంచి బయటకు లాక్కెళ్లారు. ఈ ఘటనపై స్థానిక వైద్య సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కాసేపు నిరసనకు దిగారు. డాక్టర్‌పై చేయి చేసుకున్న వ్యక్తి మరో మహిళపై బ్లేడుతో దాడి చేసిన కేసులో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు తెలిపారని వార్ధా జిల్లా వైద్యాధికారి తెలిపారు. పోలీసులు ఆ వ్యక్తిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఏదుల నుంచే వివాదానికి ముగింపు

మొదటి పేజీ తరువాయి

సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో సీఎంసమీక్ష నిర్వహించారు. శ్రీశైలం నుంచి నార్లాపూర్‌కు, అక్కడి నుంచి ఏదుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్‌హౌసలు అవసరం? ఇప్పుడున్న కెనాల్స్, సొరంగం సామర్థ్యం సరిపోతుందా? ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలి? వంటి అంశాలపై అధ్యయనం చేసి.. డిజైన్లు తయారు చేసుకోవాలని ఆదేశించారు. దీనివల్ల పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు కోత పడదని అన్నారు.

అభ్యంతరాలపై విస్తృత చర్చ..

డిండికి నీటిని ఏదుల నుంచి తీసుకోవాలా? లేక నార్లాపూర్ నుంచి తీసుకోవాలా? అనే విషయంలో మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల ప్రజాప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సీఎం నిర్వహించిన సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సందర్భంగా.. నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చు అవుతుంది, ఏదుల నుంచి తీసుకుంటే ఎంత అవుతుందనే విషయాన్ని అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ తెలిపారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చ్ఛసందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు. ఇక తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని వెల్లడించారు. కాగా, తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని అధికారులు వివరించారు. 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని తెలిపారు. దీంతో మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకొని, సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం ఆదేశించారు.

తుమ్మిడిహెట్టి వివరాలు సీడబ్ల్యూసీకి ఇవ్వండి..

తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంతో చోటుచేసుకునే ముంపుపై కచ్చితమైన వివరాలతో సిద్ధంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల వివరాలు, అక్కడ చర్చించిన అంశాలు, కోరిన సమాచారాన్ని సీడబ్ల్యూసీకి అందజేయాలన్నారు. అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఈ బ్యారేజీ నిర్మిస్తున్నామని తెలిపారు. ఆ లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ఆకాంక్షించారు. గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్త ఆశించినంత నీటిని తెచ్చుకునే వీలుండదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు.

యాదాద్రి పవర్ ప్లాంట్ అవినీతిమయం

కేసీఆర్, జగదీశ్‌లను గుంజకు కట్టేసి కొట్టాలి

బొగ్గు లేనిచోట ప్రాజెక్టు కట్టి వ్యయాన్ని రూ.9,800 కోట్లు పెంచారు

మేము అధికారంలోకి వచ్చాకే ఒడిసా నుంచి

బొగ్గు లింకేజీ ఏర్పాటుచేశాం : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

ప్రజా దీవెన, హైదరాబాద్ : యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రా నికి విదేశీ బొగ్గు సరఫరా ద్వారా 40 ఏళ్లలో రూ.లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ డిజై న్ చేశారని సీఎం రేవంత్రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ను, జగదీశ్రెడ్డిని దామరచ ర్లలో గుంజకు కట్టేసి కొట్టినా తప్పులేదని మండిపడ్డారు. ప్రపంచంలో ఎక్కడైనా ముడిపదార్థాలు ఉన్న దగ్గర పరిశ్రమ పెడతారని, బొగ్గు లభించే చోట ఈ ప్రాజె క్టును నిర్మిస్తే రూ.28వేల కోట్లతో పూర్తయ్యేదన్నారు. యాదాద్రిని బొగ్గు అందుబా టులో లేని కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంలో కట్టడం వల్ల వ్యయం రూ.37,800(రూ.9,800కోట్లు అదనం) కోట్లకు పెరిగిందని చెప్పారు. ఈ ప్రాజె క్టును గ్రేడ్ – 9 బొగ్గుతో నడిచేలా డిజైన్ చేసి, 14 మిలియన్ టన్నుల గ్రేడ్ – 9 బొగ్గును విదేశాల నుంచి తెచ్చుకునేలా ప్రణాళిక వేశారని విమర్శించారు. 40 ఏళ్లలో రూ.లక్ష కోట్ల అవినీతి కోసమే కేసీఆర్ యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని డిజైన్ చేశారని ఆరోపించారు. దీనికి తెరవెనుక ఉన్నది ప్రతిమా శ్రీనివాస్ అని తెలి పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాతే ఒరిస్సాలోని నైనీ గని నుంచి యాదాద్రికి కొత్త బొగ్గు తెచ్చామని వెల్లడించారు. ఇంత కష్టపడి రైతులకు కరెంటు ఇస్తుంటే.. కాంగ్రెస్ వస్తే కరెంటు ఉండదంటూ అబద్దాలు చెబుతున్నా రని బీఆర్ఎస్ నేతలపై సీఎం మండిపడ్డారు. బీఆర్ఎస్ నేత హరీశ్రావు ఏదైనా మాట్లాడుకోనివ్వండి.. క్షుద్రపూజలు చేసేవాళ్లు కూడా నీతులు చెబితే తెలంగాణ ప్రజలు ఎలా నమ్ముతారని ప్రశ్నించారు. మంత్రగాళు ్ల, నేరగాళ్లను నమ్మాల్సిన పని లేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కుటుంబం ఇసుక, బొగ్గు, భూములు, డ్రగ్స్ గంజాయి, కొకైన్ దేన్నీ వదల్లేదని ఆరోపించారు. ఆంధ్రా కాలే జీలు, ఆస్పత్రులకు పాల సరఫరా హరీష్ రావుదైతే.. విదేశీ విస్కీ బిజినెస్ సంతోష్ రావు పెట్టుకున్నాడని ఆరోపించారు. జూబ్లీహిల్స్ టానిక్ పేరుతో వ్యాపారాన్ని ఏర్పాటు చేశారని, ఇలా పర్మిషన్ ఇచ్చింది దేశంలో అదొక్కటేనని చెప్పారు.

నక్సల్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

నక్సల్స్ రహిత రాష్ట్రంగా తెలంగాణ

నేరాల నియంత్రణకు సమష్టి కృషి అవసరం

దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారుల భేటీలో సీఎం రేవంత్ రెడ్డి

ప్రజా దీవెన, హైదరాబాద్ : నేరాల నియంత్ర ణకు రాష్ట్రాల పోలీసు విభాగాల మధ్య సమన్వయం మరింత పెరగాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి అన్నారు. సరిహద్దులు దాటి జరిగే నేరాలకు అడ్డుకట్ట వేసేం దుకు పటిష్టమైన వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దక్షిణ భారతదేశాన్ని సురక్షిత ప్రాంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పోలీసు ఉన్నతాధికారులపై ఉందన్నారు. హైదరాబాద్ లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో దక్షిణాది రాష్ట్రాల పోలీసు ఉన్నతాధి కారుల సమన్వయకమిటీ సమావేశాన్ని శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు సంస్కర ణలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల నియంత్రణ, పోలీసు సంక్షేమం తదితర అంశాలపై మాట్లాడారు. నార్కోటిక్స్, సైబర్ నేరాల కట్టడికి కఠినచర్యలు చేపట్టామని, మన సైబర్ సైక్యూరిటీ బ్యూరో, ఈగల్ ఫోర్సు కేంద్రం అవార్డులు వచ్చాయని గుర్తు చేశారు. ఆహార కల్తీ నివారణకు టీజీ సేఫ్, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రా ఏర్పాటు చేశాం. పోలీస్ సిబ్బం ది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాం. తెలంగాణ అనుసరిస్తున్న సాంకేతిక మౌలిక సదుపాయాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఇతర రాష్ట్రాలతో పంచుకోవ డానికి ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ప్రకటించారు.

'ఎల్‌నినో'ను దీటుగా ఎదుర్కొందాం

ఇందుకోసం సమగ్ర కార్యాచరణ..

తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

కరువు మండలాలను గుర్తించాలి: భట్టి

కలెక్టర్లు ప్రతి వారం సమీక్షించాలి: ఉత్తమ్

భూగర్భ జలాలపై నివేదికలివ్వాలి: తుమ్మల

7వేల కోట్లతో సహాయక చర్యలు: సీతక్క

ఎల్‌నినోపై మంత్రివర్గ ఉప సంఘం భేటీ

త్వరలో అఖిలపక్ష సమావేశ నిర్వహించాలని నిర్ణయం



ప్రజా దీవెన, హైదరాబాద్ : 'ఎల్‌నినో'ను దీటుగా ఎదుర్కొనేందుకు చర్యలు చేపట్టాలని.. కరువు పరిస్థితులను ఎదుర్కొనడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉప సంఘం వివిధ శాఖల అధికారులను ఆదేశించింది. తాగునీరు, విద్యుత్ సరఫరా, గ్రామీణ ఉపాధి రంగాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించింది. ఈ నెల 31లోపు కరువు మండలాలను ప్రకటించాలని, త్వరలోనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని తీర్మానించింది. ఎల్‌నినోపై ఏర్పాటైన ఈ ఉప సంఘంతొలి సమావేశం శుక్రవారం సచివాలయంలో జరిగింది. సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరితోపాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

శాస్త్రీయంగా కరువు మండలాల గుర్తింపు: భట్టి

కరువు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలను అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని డిప్యూటీ సీఎం భట్టి అధికారులను ఆదేశించారు. కరువు తీవ్రత అధికంగా ఉన్న మండలాలతోపాటు 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాలను కూడా పరిశీలించాలని సూచించారు. కరువు మండలాల ప్రకటన కోసం అన్ని వివరాలను సిద్ధం చేయాలన్నారు. కరువు ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తే.. ప్రజలకు సకాలంలో సహకరించడానికి అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. తాగునీటికి ప్రాధాన్యమిస్తూ.. అందుబా టులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొన డానికి ఇంధన శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. అత్యవసర ఖర్చుల కోసం నిధులను సర్దుబాటు చేయడానికి ఆర్థిక శాఖ ప్రణాళికబద్ధంగా పని చేయాలని సూచించారు. యాసంగిలో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లేలా వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇక మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా కలెక్టర్లు సంబంధిత శాఖల అధికారులతో ప్రతి వారం సమీక్షలు నిర్వహిస్తూ కరువు ఉపశమన చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి ఎద్దడి పరిస్థితుల్లో వరి వేయొద్దని.. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మండలాల్లో భూగర్భ జలాల మట్టాలు, ఎండల తీవ్రత వంటి వివరాలపై ప్రతి వారం నివేదికల రూపంలో విడుదల చేయాలని సూచించారు. ప్రతి జిల్లా కలెక్టరు, ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్లకు అవసరమైన ప్రత్యేక నిధులను కేటాయించాలని మంత్రి సీతక్క చెప్పారు. ప్రస్తుతం రూ.7000 కోట్లతో కరువు సహాయక పనులు చేపడుతున్నామని వివరించారు. చెరువుల్లో నీటి నిల్వలు అడుగంటుతున్నందున.. పెద్ద రిజర్వాయర్లలో చేప పిల్లలను వదిలేందుకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ఇప్పటికే ప్రతి జిల్లాకు రూ.కోటి చొప్పున అత్యవసర నిధులను విడుదల చేశామని సీఎస్ సంజయ్ జాజు తెలిపారు. తక్కువ వర్షపాతం, పంటల విస్తీర్ణం 50 శాతానికంటే తక్కువగా ఉండట వంటి అంశాల ఆధారంగా 358 మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నట్లు ప్రాథమికంగా అంచనా వేశామని వివరించారు.

ఏడాదిలో రేవంత్ పాలన పాతర

ఆయనకు ఓటేయాలని ప్రజలకు ఆతృత

దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకం!

కాంగ్రెస్, బీజేపీయేతర శక్తులు ఏకం కానున్నాయి.

రాహుల్‌కి ఎన్ని జాకీలు వేసినా నిష్ప్రయోజనం

రేవంత్ పాలనకు ఇక ఏడాదే గడువు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ప్రజా దీవెన, హైదరాబాద్ : ఆచరణకు నోచుకోని హామీలు, ఆసత్య ప్రచారాలే.. కాంగ్రెస్ సర్కార్కు ఉరితాళ్ళుగా బిగుసుకు పోతున్నాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రె సిడెంట్ కేటీ రామారావు దుయ్యబట్టారు. దేశ రాజకీయాల్లో రాహుల్ గాంధీని జాకీలు పెట్టి లేపినా ప్రయోజనం లేదని విమర్శించారు. రాష్ట్రం, దేశరాజకీయాల్లో కేసీఆర్ కీలకం కానున్నారని చెప్పారు. కాంగ్రెస్ మోస పూరిత హామీలకు మోస పోయిన ప్రజలు మరో ఏడాది ఓపిక పడితే వచ్చేది కేసీఆర్ పాలనేనని భరోసా ఇచ్చారు. కేసీఆర్ కు ఓటు ఎప్పుడు వేద్దామా అని ప్రజలు ఆతృతగా ఉన్నారని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ కు జెడ్పిటీసీ, ఎం ఎంపీటీసీ ఎన్నికలు జరిపించే దమ్ము లేదని దుయ్యబట్టారు. ఎన్నికలు ఏవైనా టీఆర్ఎస్ భారీ మెజారిటీతో గెలవడం బాయమని ధీమా వ్యక్తం చేశారు. మేడిగడ్డను కాంగ్రెస్ నాయకులు కూల్చి రాహుల్ గాందీని తీసుకువచ్చి అసత్య ప్రచారం చేశారని మండిపడ్డారు. మితిమీరి పోతున్న కాంగ్రెస్ పాలకులకు రోజులు దగ్గర పడ్డాయని హెచ్చరించారు. శుక్రవారం తెలం గాణ భవన్ లో బీఆర్ఎస్ అంబర్ పేట నియోజకవర్గం ముఖ్యనేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో దేశ, రాష్ట్ర రాజకీయాలపై నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాబోయే పట్టభద్రుల ఎన్నికల్లో వీఆర్ఎస్ ఓటర్ల నమోదుపై ఎక్కడి క్కడ పార్టీ సారించాలని చెప్పారు. రేవంత్ రెడ్డి సర్కార్ ను పట్టభద్రులు, నిరుద్యోగులు నమ్మే ప్రసక్తే లేదని చెప్పారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తేనే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్డమైన వాగ్దానాలు చేసినా హైదరాబాద్ ప్రజలు నమ్మలేదని గుర్తుచేశారు. రాబోయే హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల్లో బీఆర్ఎస్ భారీ మెజారిటీ నమోదు చేసుకోనుం దని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ కార్పొరేషన్ ఎన్నికలు పెట్టే ధైర్యం రేవంత్ రెడ్డికి లేదని పేర్కొన్నారు. కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017లో సెంచరీ కొట్టిన తీరుగా బీఆర్ఎస్ కార్పొరేషన్లను గెలుచుకుంటు ందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కృష్ణా నదిలో ఈ ఏడాది 250 టీఎంసీలు, గోదావరిలో 750 టీఎంసీలు వరదలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోయక పోవడంతోనే కరువు వచ్చిందని కేటీఆర్ విచారం వ్యక్తం చేశారు.

మేడిగడ్డను కాంగ్రెస్ కూల్చింది

కాళేశ్వరం పంపులు ప్రారంభిస్తే కేసీఆరకు పేరు వస్తుందని, తాను చేసిన అబద్దాలు ప్రజల ముందు తేలిపో తాయని రేవంత్ రెడ్డి కుట్ర చేశారని కేటీఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ కూలిపోయిందంటూ తప్పుడు ప్రచారం చేశారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు మేడిగడ్డను బాంబుల తో కూల్చి రాహుల్ గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డ కూలిపోయిందంటూ అబద్ధాలను ప్రచారం చేశారని నిప్పులు చెరిగారు. రేవంత్ రెడ్డి దున్నపోతు ఈనిందంటే కిషన్ రెడ్డి దూడను గాటన కట్టేయమంటారని ఎద్దేవా చేశారు. కేసీ ఆర్పి విమర్శలు చేసే అంశంలో కాంగ్రెస్, బిజేపీ ఒక్కటి అవుతాయని దుయ్యబట్టారు. ఈ సంవ త్సరంలోగా కాంగ్రెస్ సర్కార్ చేసేది ఏమీ లేదని, తిరిగి కేసీఆర్ ముఖ్య మంత్రి కావడం ఖాయమని, కాంగ్రెస్ చేతుల్లో మోస పోయిన ప్రజలకు న్యాయం జరగడం ఖాయమని చెప్పారు. దేశరాజకీయాల్లో కీలకం కానున్న కేసీఆర్ రాష్ట్ర, దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకం కానున్నారని కేటీఆర్ చెప్పారు. కేసీఆర్ నాయకత్వంలో కాంగ్రెస్, బీజేపీయేతర పార్టీలు కీలకం కాబోతున్నాయని చెప్పారు. నాలుగేళ్ల క్రితం కేసీఆర్ కాంగ్రెస్, బీజేపీ యేతర కూటమి అంటే చాలామందికి అర్థం కాలేదు. మోదీ ఏం చేస్తున్నాడో చూస్తూనే ఉన్నాం. ఈరోజు ఒకవైపు దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్న బీజేపీకి.. ప్రత్యామ్నాయ ఎజెండా లేని కాంగ్రెస్ను చూసిన తర్వాత కేసీఆర్ చెప్పింది వాస్తవంగా ప్రజలు, వివిధ పార్టీల నాయకులు అంగీకరిస్తున్నారని చెప్పారు. రాహులికి ఎన్ని జాకీలేసినా ప్రయోజనం లేదని ఇది కాంగ్రెస్ భూస్థాపితం కావడం తప్పదని అన్నారు. కాంగ్రెస్ విఫలమైంది కాబట్టే బీజేపీ పార్టీపై సీజేపీ పేరుతో యువత పోరాటం చేస్తున్నదని గుర్తు చేశారు.

భయపెడుతున్న రేవంత్ భరతంపడతారు ప్రజలు

ప్రజా దీవెన, హైదరాబాద్ : కరువు కమ్ముకుని వస్తుంటే చేతులెత్తి ఆహ్వానిస్తున్న రేవంత్రెడ్డి చరిత్ర హీనుడిగా మిగిలి పోతారని బీఆర్ఎస్ శాసనసభా పక్ష ఉపనేత హరీష్ రావు మండిపడ్డారు. కరువు నుంచి ప్రజలను కాపాడాల్సిన సీఎం రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని దుయ్యబట్టారు. కరువుపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా చీము నెత్తురు, సిగ్గు, లజ్జ లేకుండా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విరు చుకుపడ్డారు. అసమర్థుడికి అధికారం అప్పగిస్తే ఇల్లు పీకి పందిరి వేసినట్లుగా రేవం త్ రెడ్డి పాలన ఉందని హరీష్ రావు విచారం వ్యక్తం చేశారు. రేవంత్రెడ్డి రంకెలు వేసినంత మాత్రాన నిజం అబద్దంగా మారిపోదని హెచ్చరించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు కాంగ్రెస్ తెచ్చిన కరువని దుయ్యబట్టారు. ప్రజలకు భరోసా ఇవ్వడం మానేసి భయభ్రాం తులకు గురిచేస్తావా రేవంత్ రెడ్డి అంటూ నిలదీశారు. కరువు వస్తోంది.. నేనేం చేయలేనని సీఎం హోదాలో చేతులు ఎత్తేయడం సిగ్గుచేటని నిప్పులు చెరిగారు. కరువు వస్తున్నది తాగడానికి నీళ్లు దొరకవు. అంటూ ప్రజలను రేవంత్ రెడ్డి భయభ్రాంతులకు గురిచేయడం ఆయన చేతకానితనానికి నిదర్శనమని పేర్కొన్నారు ప్రజలను కాపాడాలనే సోయిలేకుండా వ్యవహరించే రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో ఏ శిక్షవేసినా తక్కువేనని హెచ్చరించారు. కరువునివారణ చర్యలు చేపట్టి



ప్రజలకు భద్రత కల్పిం చలేని రేవంత్రెడ్డికి సీఎం పదవిలో కొనసాగే నైతిక అర్హత లేదని అన్నారు.

కేసీఆర్ సీఎంగా ఉంటే కరువు తాకేది కాదు

ప్రస్తుత కరువు పరిస్థితుల్లో సీఎంగా కేసీఆర్ ఉంటే కరవు తెలంగాణ నేలను కూడా తాకేందుకు భయపడేదని హరీష్ రావు చెప్పారు. వచ్చిన నీటిని వచ్చినట్టుగా ఒడిసిపట్టి.. తెలంగాణకు కరువు రాకుండా కేసీఆర్ చూసేవారని చెప్పారు. ఎల్ నినో వస్తున్నదని సంవత్సర కాలంగా శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నా రేవంత్రెడ్డి ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. పుట్టిన గడ్డనే కరువు రక్కసికి బలిచ్చేందుకు చూస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజాక్షేత్రంలో శిక్షతప్పదని హెచ్చరించారు. కరువు వస్తున్నదని అసమర్థ సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను భయపెట్టడం కాదు కరువును ఎదుర్కొనేందుకు నీటి నిల్వలు, విద్యుత్, ప్రత్యామ్నాయ పంటలు, పశుగ్రాసం, ఉపాధి అంశాలపై కార్యాచరణ ఏమిటని రేవంత్ రెడ్డిని హరీష్ రావు ప్రశ్నించారు. గోదావరి, కృష్ణా నదుల నుంచి నీళ్లను ఎందుకు ఎత్తిపోయలేదు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఎందుకు పెంచుకోలేదు. బొగ్గు నిల్వలు ఎందుకు లేవని ప్రశ్నించారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లో లేని కరువు తెలంగాణలో ఎందుకు వస్తున్నదని ప్రశ్నించారు. కరువు పేరుతో వ్యవసాయానికి నీళ్లు ఇవ్వలేమని ముందే చేతులెత్తేయడం పాలనా దక్షత కాదని సీఎం రేవంత్ రెడ్డిని దుయ్యబట్టారు. రాబోయే భయంకరమైన కరువు నుంచి ప్రజలను రేవంత్ రెడ్డికాపాడలేనని స్పష్టం చేయడం ఆందోళన కలిగిస్తున్న అంశమని విచారం వ్యక్తం చేశారు. కేసీఆర్ పై విమర్శలు చేయడానికి చూపిస్తున్న శ్రద్ధలో పావు వంతైనా రైతులకు, ప్రజలకు నీళ్లు అందించడంపై రేవంత్ రెడ్డి చూపించాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రతిపక్షాలపై నిందలు వేయడం, ప్రచార ఆర్భాటాలు పక్కకు పెట్టి కరువు నుంచి తెలంగాణను కాపాడాలని కాంగ్రెస్ పాలకులను హరీష్ రావు డిమాండ్ చేశారు

పరిశ్రమలో గ్యాస్ లీక్.. ఇద్దరి మృతి

మరో ఆరుగురికి తీవ్ర అస్వస్థత

సంగారెడ్డి జిల్లా గడ్డపోతారంలోని.. సరాకా పరిశ్రమలో ఘటన

టీజీపీసీబీ తనిఖీలు.. మూసివేతకు ఆదేశాలు

ప్రజా దీవెన, హైదరాబాద్ : సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం సరాకా లేబొరేటరీస్ పరిశ్రమలో గురు వారం రాత్రి క్లోరోఫామ్ గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ పరిశ్రమలో గురు వారం రాత్రి కార్మికులు నైట్ షిఫ్ట్ విధుల్లో ఉండగా.. ప్రొడక్షన్ బ్లాక్ యూనిట్-2 క్లోరోఫామ్ సైడ్లైన్ వాల్వ్ నుంచి గ్యాస్ లీకైంది. దీంతో 8 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని ఆస్ప త్రికి తరలించగా.. పంగా సుదర్శనావు(44), కిలపర్తి బాలాజీ(29) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వీరిద్దర్తూ ఏపీలోని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వారు. ఈ ప్రమాదంపై పటానచెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సిగాచీ ప్రమాదాన్ని మరువక ముందే మరో ఘటన జరగడం ప్రభుత్వ వైఫల్య మని విమర్శించారు. మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.70 లక్షల చొప్పున పరిహారం, అంత్యక్రియలకు రూ.1లక్ష నగదును యాజమాన్యం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు, వారి కుటుంబసభ్యులను ఆయన పరామర్శించారు. కాగా, ఈ ఘటనపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) చర్యలు చేపట్టింది. ప్రమాద తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న టీజీపీసీబీ అధికారులు శుక్రవారం పరిశ్రమను తనిఖీ చేశారు. పరిశ్రమ జనరల్ మేనే జర్ మధు, డిప్యూటీ జనరల్ మేనేజర్ యోగేశ్వర్రావు నుంచి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. పరిశ్రమను తక్షణమే మూసివే యాలని ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిపివేయాలని టీజీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఘటన తీవ్రత దృష్ట్యా పరిశ్రమ యాజమాన్యానికి ముందస్తు విచారణ అవకాశం కల్పించకుండానే మూసివేత ఉత్తర్వులు జారీ చేసినట్లు టీజీ పీసీబీ వెల్లడించింది.

కోటి చొప్పున పరిహారం ఇవ్వాలి: హరీష్ రావు

సరాకా రసాయన పరిశ్రమలో గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు మృతి చెందడం తీవ్ర విషాదకరమని బీఆర్ఎస్ నేత హరీశ్రావు పేర్కొన్నారు. నాడు సిగాచీ.. నేడు సరాకా పరిశ్రమలో ప్రమాదం.. అయినా గత చేదు అనుభవాల నుంచి ఈ ప్రభుత్వం ఏం నేర్చుకోదా? అని శుక్రవారం ఎక్స్ లో ప్రశ్నించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి, కంపెనీ యాజమా స్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సిగాచీ ఘటనలో ఇంటి పెద్దలను కోల్పోయిన 54 మంది కార్మిక కుటుంబాలకు సీఎం స్వయంగా ప్రకటించిన కోటి రూపాయల పరిహారాన్ని ఇప్పటికైనా అందించి మాట నిలుపుకోవాలని సూచించారు. సరాకా పరిశ్రమ ప్రమాదంలో గాయప డిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల చొప్పున పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

అమెరికా వీసా కోసం అత్తాపూర్ వాసి ఆత్మార్పణం

గతంలో ఒకసారి దరఖాస్తు తిరస్కరణ

తీవ్ర మనోవేదనకు గురైన రోహిత్ రెడ్డి

హైదరాబాద్‌లోని అత్తాపూర్లో ఘటన

ప్రజా దీవెన, హైదరాబాద్ : అమెరికా వీసా వస్తుందో రాదోనన్న ఆందోళనతో ఓ యువకుడు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన హైదరాబాద్లోని అత్తాపూర్ తేజస్వీనిన గర్లో జరిగింది. తేజస్వీనినగర్ కాలనీకి చెందిన చంద్రారెడ్డి, ఇందిరల కుమారుడు రోహిత్రెడ్డి (26) అమెరికాలో చదువుకోవడానికి గతంలో ఒకసారి వీసాకు దరఖాస్తు చేసుకోగా తిరస్కరణకు గురైంది. దీంతో అతడు రెండోసారి వీసా కోసం ప్రయత్నిస్తున్నాడు. అయితే ఈసారైనా వీసా వస్తుందో రాదోనని రోహిత్రెడ్డి కొద్దిరోజులుగా తీవ్ర మనోవేదనకు, ఆందోళనకు గురవుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ భయం తోనే శుక్రవారం ఇంట్లోని తన గదిలో ఫ్యాన్కు చీరతో ఉరివేసుకుని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు అత్తాపూర్ పోలీసులు వెల్లడించారు.

దూసుకొస్తున్న తుఫాన్!

నేటి ఉదయానికి వాయుగుండం

ఎల్లుండికి తుఫాన్గా.. ఆపై తీవ్ర తుఫాన్గా

28న ఉత్తర కోస్తాలో తీరం దాటే అవకాశం

120-160 కి.మీ. వేగంతో పెనుగాలులు

తుఫాన్కు 'ఆర్నాబ్'గా నామకరణం

విశాఖపట్నం: తుఫాన్ దూసుకువస్తోంది. ఈశాన్య రుతు పవనాల సీజన్లో దూసుకొస్తున్న తొలి తుఫాన్ ఇదే. రాష్ట్రం స్థానిక సంస్థల ఎన్నికల హడావుడిలో.. రైతులు ఖరీఫ్ పంట కోత పనుల్లో ఉన్న సమయంలో అందరి దృష్టినీ తన వైపు మళ్లించేలా తుఫాన్ తీవ్రత ఉండబోతోంది. ఉత్తర కోస్తా జిల్లాల్లో తీవ్ర విధ్వంసం సృష్టించేలా దూసుకొస్తున్న తుఫాన్... అతి తీవ్ర తుఫాన్గా బలపడి తీరాన్ని తాకనున్నది. ముఖ్యంగా ఈ నెల 27, 28 తేదీల్లో ఉత్తర కోస్తాలో గంటకు 120 నుంచి 160 కిలోమీటర్లు.. అప్పుడప్పుడు 185 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీయనున్నాయి. ఇదే సమయంలో శ్రీకాకుళం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా వరకు భారీ నుంచి అతిభారీగా, అక్కడక్కడా కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈమేరకు ఏపీ, ఒడిశా ప్రభుత్వాలను అప్రమత్తం చేసింది. తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతం, అండమాన్ సముద్రంలో రెండు రోజులపాటు కొనసాగిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శుక్రవారం ఉదయం తూర్పు మధ్య, ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి శనివారం ఉదయానికి అదే ప్రాంతంలో వాయుగుండంగా మారుతుంది. ఈ క్రమంలో పశ్చిమ వాయవ్యంగా పయనిస్తూ 25 నాటికి తీవ్ర వాయుగుండంగా బలపడి తూర్పు మధ్య దానికి ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తుంది. ఆపై మరింత బలపడి 26వ తేదీకల్లా పశ్చిమ మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశిస్తూనే తుఫాన్గా మారుతుంది. ఈ తుఫాన్కు 'ఆర్నాబ్' అని పేరు పెట్టనున్నారు. ఆ తర్వాత రెండు రోజుల్లో తుఫాన్ మరింత బలపడి అతి తీవ్ర తుఫాన్గా మారుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ క్రమంలో ఉత్తర కోస్తా, దక్షిణ ఒడిశా తీరాల మధ్య (కళింగపట్నం- మచిలీపట్నం మధ్య తీరం దాటుతుందని పలు మోడళ్లు, విశాఖపట్నం- కాకినాడ మధ్య అని మరికొన్ని మోడళ్లు అంచనా వేస్తున్నాయి) తీరం దాటనున్నదని పేర్కొంది. 27 నుంచి ఉత్తరకోస్తా జిల్లాల్లో తీరం వెంబడి, దానిని ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో గంటకు 120 నుంచి 160, అప్పుడప్పుడు 185 కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీయనున్నాయి. కోస్తాలో అనేకచోట్ల వర్షాలు కురుస్తాయి. విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు భారీ నుంచి అతిభారీగా, గుంటూరు, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. 28న అనకాపల్లి, అల్లూరి, కాకినాడ, పోలవరం, తూర్పు, పశ్చిమగోదావరి, కోనసీమ జిల్లాల్లో కుంభవృష్టి, శ్రీకాకుళం, కృష్ణా జిల్లాల్లో అతిభారీ, గుంటూరు నుంచి నెల్లూరు వరకు అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తాయి. సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు శనివారం ఉదయానికల్లా తీరానికి చేరుకోవాలని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం తెలిపింది.

సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటాం

విభజన శక్తులకు వ్యతిరేకంగా ఏకమవ్వాలి

సవాళ్లను ఎదుర్కొనేందుకు మరింత చురుగ్గా ఉండాలి

యువత భాగస్వామ్యంతో బలమైన భారత్ను నిర్మించాలి

'చిన్మయ మిషన్' సమ్మేళనంలో ప్రధాని మోదీ పిలుపు



న్యూఢిల్లీ : విభజన శక్తులకు వ్యతిరే కంగా సమాజం అంతా ఒక్క టవ్వాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ప్రజల్లో స్వావలంబనపై అవగాహన పెంచడంతోపాటు దేశంలోని ప్రతి ఒక్కరినీ 2047 నాటికి వికసిత భారత్ నిర్మాణ లక్ష్యంతో అనుసంధానించా లని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా దేశం కొత్త సవాళ్లను ఎదుర్కొం టోందని, సమాజంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని స్పష్టం చేశారు. శుక్రవారం ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన చిన్మయ మిషన్ అమృత మహోత్సవ అంతర్జాతీయ సమ్మేళనం ప్రారంభం సందర్భంగా ప్రధాని మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. చిన్మయ మిషన్ సేవలను ప్రధాని ప్రశంసించారు. స్వామి చిన్మయా నంద ప్రారంభించిన ఆధ్యాత్మిక ఉద్యమం ద్వారా లక్షలాది మంది యువత భారతీయ సంస్కృతికి ప్రతినిధులుగా నిలుస్తున్నారని చెప్పారు. చిన్మయా నందతో తనకున్న అనుబంధాన్ని మోదీ ఈ సంద ర్భంగా గుర్తుచేసుకున్నారు. దేశాభివృద్ధిలో యువత। భాగస్వామ్యానికి తన పాలనలోనూ ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. చిన్నయ మిషన్ అమృత మహోత్సవంలో భాగంగా యువ వలంటీర్లు 300 రోజుల వ్యవధిలో 40 వేల కిలోమీటర్లకు పైగా ప్రయాణించి లక్ష మందికి పైగా యువతను కలు సుకోవడాన్ని మోదీ అభినందించారు. భారతీయ తాత్విక సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రస్తావిస్తూ ఉపనిషత్తుల్లోని 'వయం అమృతస్య పుత్రాః అనే వాక్యాన్ని మోదీ ఉటంకించారు. మనం అమృతత్వా నికి వారసులమనే భావన భారతీయ జ్ఞాన సంప దకు, ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీక అని వివరించారు. వేల సంవత్సరాలుగా భారత్ జ్ఞాన అన్వేషణ, ఆధ్యాత్మిక వికాసం దిశగా సాగుతోందని చెప్పారు. దేశ శ్రేయస్సు కోసం ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండా లని పిలుపునిచ్చారు. దేశం పట్ల బాధ్యతగా వ్యవహరిం చడం. జాతీయ ప్రగతికి తోడ్ప డడం ప్రతి పౌరుడి కర్తవ్య మని తెలిపారు. దేశ సాంస్కృతిక ప్రదేశాలకు అంతర్జాతీయ గుర్తింపు లబిస్తుం డడం సంతోషకరమని, గత 12ఏళ్లలో 650కు పైగా ప్రాచీన విగ్రహాలను విదేశాల నుంచి భారత్కు తిరిగి తీసుకొచ్చినట్లు మోదీ ఈ సందర్భంగా తెల్లి పారు.

సవాళ్లు మారుతున్నాయి

కాలానుగుణంగా సవాళ్లు మారుతున్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సంస్థలు, ప్రజలు మరింత చురుగ్గా వ్యవహరించాలని ప్రధాని మోదీ పిలుపుని చ్చారు. ఒక్కో సంస్థకు ఒక్కో లక్ష్యం ఉన్నప్పటికీ, అంతిమంగా దేశాభివృద్ధి.. జాతీయ గౌరవం అనే ఉమ్మడి గమ్యమే అందరినీ నడిపించాలని అన్నారు. విభజన శక్తులకు వ్యతిరేకంగా సమాజాన్ని ఏకం చేయడం, పౌరులను స్వావలంబన దిశగా ప్రేరేపించడం, ప్రతి ఒక్కరినీ వికసిత భారత్ సంకల్పంలో భాగస్వాములను చేయడం తక్షణ కర్తవ్యాలని స్పష్టం చేశారు. 1951లో చిన్మయానంద స్థాపించిన చిన్మయ మిషన్ 75ఏళ్ల ప్రస్థానానికి ముగింపుగా నిర్వహిస్తున్న ఈ 3రోజుల అంతర్జాతీయ సమ్మేళ నంలో 9 వేల మందికి పైగా పాల్గొంటున్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. అరాచకాన్ని తరిమేద్దాం

ఓటర్లలో చైతన్యానికి బీజేపీ ప్రచార భేరీ!

ఎస్ఐఆర్పై ప్రజల్లో అవగాహన పెంచేందుకు బీజేపీ శ్రీకారం చుట్టింది. 'ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం.. అరాచకాన్ని తరిమేద్దాం' పేరుతో దేశవ్యాప్తంగా రెండు విడతల్లో ఈ భారీ ప్రచార కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పార్టీ వెల్లడించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ మార్గదర్శకత్వంలో శుక్రవారం ప్రారంభమైన మొదటి విడత ప్రచారంనవంబరు 5వరకు కొనసాగనుంది. రెండో విడత కార్యక్రమాలు నవంబరు 11నుంచి 30వరకు నిర్వహించనున్నారు. ఎస్ఐఆర్పై విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టడమే లక్ష్యంగా ఈ ప్రజా చైతన్య ఉద్యమాన్ని చేపట్టినట్లు బీజేపీ స్పష్టం చేసింది. ప్రచారంలో భాగంగా ప్రతి జిల్లా కేంద్రంలో కనీసం 10వేల మందితో పాదయాత్రలు చేపట్టనున్నారు.

అరుణాచల్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు

భారత్-చైనా సైనికుల మధ్య ముఖాముఖి..!

డ్రోన్లను మోహరించిన ఐటీబీపీ దళాలు

ఎస్ఏసీ వెంబడి బంకర్ల నిర్మాణం కూడా

చైనాతో ముఖాముఖి తలపడే అవకాశం

ఐటీబీపీ డైరెక్టర్ జనరల్ కపూర్ వెల్లడి

మంచి పరిణామం కాదు: విదేశాంగ శాఖ

చర్చలు ఏమయ్యాయి: మోదీకి ఖర్గే ప్రశ్న

సరిహద్దు వివాదాలకు చర్చలే

పరిష్కారమని చైనా గుర్తించాలి: నరవణే



న్యూఢిల్లీ : అరు ణాచల్ ప్రదేశ్లోని భారత్-చై నా సరిహద్దుల వెంబడి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయని ఇండోటిబెటిన్ బార్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్ శత్రుజిత్ సింగ్ కపూర్ వెల్లడిం చారు. గత కొన్నిరోజులుగా ఇరు దేశాల సైనికుల మధ్య ముఖాముఖి తలపడే పరిస్థితి నెలకొందని తెలిపారు. దీంతో సరిహద్దుల వెంబడి భద్రత, ముందస్తు చర్యలను పటిష్టం చేసినట్లు వివరించారు. వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ) వద అవసరమైన చోట బంకర్ల నిర్మాణం చేపట్టినట్లు తెలి పారు. అలాగే, గాల్వాన్ వంటి పెద్ద సంఘర్షణలు ఏర్పడినా సమర్థంగా తిప్పికొట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ క్రమంలో సరికొత్త ప్రతిదాడి వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు భారత్ అతిపెద్ద శత్రువు చైనాను. ఎదుర్కొనేందుకు భూగర్భ మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల చివరిలో ఉద్యోగ విరమణ చేయనున్న కపూర్ రాజస్థాన్లోని అల్వార్లో సైనికులను ఉద్దేశించి మాట్లాడారు. "గత కొన్ని రోజులుగా సరిహద్దు వెంబడి పరిస్థితి తీవ్రంగా ఉంది." అని పేర్కొన్నారు. ఇటీవల ఉక్రెయిన్-రష్యా, ఇరాన్-అమెరికా యద్ధాలను గమనిస్తే డ్రోన్లు, యాంటీ డ్రోన్ టెక్నాలజీ ప్రాముఖ్యత అవగతమవుతుందని ఆయన అన్నారు. దీనివల్లనే ఒక చిన్న దేశం కూడా అతి పెద్ద దేశానికి యుద్ధంలో చుక్కలు చూపించిం దన్నారు. చైనా సరిహద్దు ఎంతో సంక్లిష్టమైందని, శక్తివంతమైన పొరుగు దేశమైన చైనా మనకు అతి పెద్ద శత్రువని కపూర్ అన్నారు. ఉక్రెయిన్ను లొంగ దీసుకోవడానికి ప్రయత్నిస్తున్న అతి పెద్ద దేశమైన రష్యా నాలుగేళ్లుగా తీవ్రంగా శ్రమిస్తోందని ఈ రోజున నెలకు పది నుంచి 15 వేల మంది సైనికులను కోల్పో తుందని కపూర్ గుర్తు చేశారు. అమెరికాతో ఇరాన్ కూడా కొన్నా ళ్లుగా సమర్థవంతంగా తలపడు తున్న విషయాన్ని ఆయన ప్రస్తా వించారు. సంప్రదాయ యుద్ధ తంత్రాలు పోయి డ్రోన్లు తెరపైకి వచ్చాయని కాబట్టి మనం కూడా ఆ సాంకేతికతను అందిపుచ్చుకోవాల్సిందేనని కపూర్ అన్నారు. ఐటీబీపీకి ప్రభుత్వం కేటాయిస్తున్న 400 కోట్ల నిధుల్లో 70 శాతం ఈ డ్రోన్ సాంకేతిక తను పెంపొందించుకోవడానికే వినియోగిస్తున్నట్లు కపూర్ వెల్లడించారు. అరుణాచల్ ప్రదేశ్లోని సరి హద్దు ప్రాంతాల్లో చైనా బలగాలతో మన జవాన్లు ముఖాముఖి తలపడే పరిస్థితులు కొనసాగుతునే ఉన్నాయని కపూర్ వెల్లడించారు. సరిహద్దుల్లోని చాలా ప్రాంతాల్లో కొన్ని రోజులుగా ఇలాంటి పరిసి తులు ఎదురవుతున్నాయని ఆయన వెల్లడించారు. ఐటీబీపీకి చెందిన సరికొత్త యుద్ధ దళం శౌర్య కమాండోస్ తమ నైపుణ్యాలను చైనాకు చెందిన పీఎల్ దళాలకు చూపిస్తున్నాయని కపూర్ తెలిపారు. 95 వేల మందికి కఠిన శిక్షణ ఇచ్చినట్టు తెలి పారు. అయితే, సరిహద్దుల్లో నెలకొన్న పరిస్థితులు సాధారణ బలగాల మోహరింపులో భాగమేనంటూ కపూర్ వ్యాఖ్యలపై చైనా స్పందించింది.

సంబంధాలను దెబ్బతీస్తుంది: భారత్

ఎస్ఏసీ వెంబడి చైనా దళాలు 'హద్దులు' మీరు తున్న పరిస్థితిపై భారత్ తీవ్రంగా స్పందించింది. ఇది సరైన విధానం కాదని పేర్కొంది. ఈ పరిణా మాలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బ తీస్తాయని స్పష్టం చేసింది. సరిహద్దుల వెంబడి శాంతి, ప్రశాంతతను కాపాడడం అత్యవసరమని పేర్కొంది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అధి కార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడారు. "గతంలో కూడా ఇలానే జరిగింది. చైనా దళాలు తమ నిర్ధారిత గస్తీ ప్రాంతాలను విస్మరించినప్పు డల్లా ఉద్రిక్తతలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో భారత్-చైనా సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితి అస్తవ్య స్తంగా మారుతోంది." అని తెలిపారు. ఇరు పక్షాలు దౌత్య, మిలటరీ ద్వారా సరిహద్దుల వెంబడి ఉన్న అపరిష్కృత అంశాలను పరిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నాయని జైస్వాల్ వివరించారు.

ఇకనైనా నిజాలు చెప్పండి: ఖర్గే

చైనాకు క్లీన్చట్లు ఇచ్చింది చాలని, ఇకనైనా దేశ ప్రజ లకు నిజాలు చెప్పాలని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ.. చర్చలు, సమావేశాల పేరుతో ఫొటోలకు ఫోజులి వ్వడం మానేసి, వాస్తవాలు వెల్లడించాలన్నారు. అరుణాచల్ ప్రదేశ్ లో చైనా బలగాల కవ్వింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని ఐటీ బీపీ డైరెక్టర్ జనరల్ ధ్రువీకరించడం తీవ్ర ఆందో శన కలిగించే విషయమని తెలిపారు. "డోక్లాం, పరిణామాల గల్వాన్ తర్వాత సరిహద్దుల్లో మరో తీవ్రమైన ఘర్షణ వాతావరణం నెలకొంటోందా?" అని ప్రశ్నించారు. ఆగస్టులో టాక్సింగ్ సమీపంలో చైనా చొరబాట్లు జరిగినట్లు వార్తలు వచ్చాయన్నారు. కార్న్ కమాండర్ స్థాయి చర్చలు జరిగిన 47రోజుల తర్వాత కూడా, 180 కిలోమీటర్ల దూరంలోనే ఇలాంటి కవ్వింపులు కొనసాగుతుండడం సరికాద న్నారు. సరిహద్దుల్లో భారత సైన్యానికి పెట్రోలింగ్ చేసుకునే హక్కుల విషయంలో కేంద్రం రాజీ పడిందా? అని నిలదీశారు. అలాగే, సరిహద్దు ఉద్రిక్తతల మధ్య చైనాతో వాణిజ్యంపై కేంద్రం అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరిని ఖర్గే తప్పుబ ట్టారు. 2020-21లో గల్వాన్ లోయలో 20 మంది భారత సైనికులు ప్రాణత్యాగం చేసిన తర్వాత కూడా చైనా దిగుమతులు ఏకంగా 102% పెరిగా యని ఆందోళన వ్యక్తం చేశారు. భారతీయ ఎగు మతులను చైనా ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోం దని ఆర్థిక మంత్రి స్వయంగా అంగీకరించారని, మరోవైపు చైనా పెట్టుబడులపై ఆంక్షలు సడలిం చడం, చైనా సంస్థలకు పీఎల్ ఐ ప్రయోజనాలు కల్పించే యోచనలో ఉండటం దారుణమన్నారు. కేంద్రాన్ని చూస్తుంటే 'మేక్ ఇన్ ఇండియా' పదకం కాస్తా 'ఇంపోర్ట్ ఫ్రమ్ చైనా'గా మారిపో యిందా? అని ఎద్దేవా చేశారు.

ప్రజా దీవెన
సమ సమాజ సంక్షేమం మా సంకల్పం...

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్వోత్తమ్‌రెడ్డి
గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



ప్రజా దీవెన, తుంగతుర్తి: త్వరలో జరగనున్న ఉమ్మడి నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని తుంగతుర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేగటి రవి గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలో మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆత్మ కమిటీ చైర్మన్ పానుగంటి నరసింహారెడ్డి మాట్లాడుతూ... పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ఎన్ఎస్ యూఐ, యువజన కాంగ్రెస్ నాయకుల భాగస్వామ్యంతో ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి గ్రామంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులైన వారు ఎవరూ నమోదు ప్రక్రియకు దూరం కాకుండా చూడాలని, గ్రామస్థాయిలో సమన్వయంతో పటిష్టమైన కార్యాచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తుంగతుర్తి సింగిల్ విండో చైర్మన్ గుడిపాటి సైదులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, గ్రంథాలయ చైర్మన్ గంగరాజు, జిల్లా కార్యదర్శి మారగాని వెంకటయ్య, పోలేపాక రామచంద్రు, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు పొన్నాల సృజన్ కుమార్, నల్లు రామచంద్రారెడ్డి, దాసరి శ్రీను, తప్పట్ల శంకర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బికోజి, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు రియల్ ఎస్టేట్ అప్పీలేట్ ట్రిబ్యునల్ పరిపాలన సభ్యుడిగా డా. కూతాటి గోపాల్
ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ తో మర్యాదపూర్వక భేటీ



శాలిగౌరారం : నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండల కేంద్రానికి చెందిన, తమిళనాడు క్యాడర్ లో చీఫ్ సెక్రటరీ స్థాయి అధికారిగా ఉండి ఈ మధ్య కాలంలో రిటైర్ అయిన సీనియర్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కూతాటి గోపాల్ కీలక పదవిని చేపట్టారు. 1966 ఫిబ్రవరి 10న శాలిగౌరారంలో అతి పేద కుటుంబంలో జన్మించిన డా. గోపాల్ ఎంబీబీఎస్ పట్టభద్రులు. 1992 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన ఆయన రెండు జిల్లాలకు కలెక్టర్ గా, ముఖ్యమైన సంస్థలకు ఎండీగా, ఎన్నో డిపార్ట్ మెంట్స్ కు సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, అడిషనల్ చీఫ్ సెక్రటరీ స్థాయిలో పనిచేశారు. తమిళనాడు రాష్ట్రంలోనే కాకుండా భారత ప్రభుత్వంలోనూ సేవలందించారు. కీలక శాఖలు అయిన రూరల్ డెవలప్మెంట్ అండ్ పంచాయతీరాజ్, ట్రాన్స్ పోర్ట్, హయ్యర్ ఎడ్యుకేషన్, సహకార, ఆహార మరియు వినియోగదారుల రక్షణ మొదలైన శాఖలలో అడిషనల్ చీఫ్ సెక్రటరీ హోదాలో సమర్థవంతంగా పనిచేసి ప్రభుత్వ ప్రశంసలు అందుకున్నారు. 2014 గోల్డెన్ లీఫ్, 2002 గ్రీన్ అవార్డు గ్రహీత కూడా. చివరిగా 2023 ఆగస్టు 17 నుండి 2026 ఫిబ్రవరి 28 వరకు అడిషనల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. పదవీ విరమణ అనంతరం ఆయన సేవలను గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం ఆయనను తమిళనాడు రియల్ ఎస్టేట్ అప్పీలేట్ ట్రిబ్యునల్ కు పరిపాలన సభ్యుడిగా ఐదు సంవత్సరాల కాలానికి నియమించింది. ఇటీవల ఆయన బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ను డాక్టరు కూతాటి గోపాల్ తమిళనాడు సచివాలయంలోమర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి మాట్లాడారు.

బుడిగె కార్తీక్ జన్మదిన సందర్భంగా అన్నప్రసాద వితరణ

శాలిగౌరారం : నల్లగొండ జిల్లా శాలిగౌరారం చెందిన బుడిగె శ్రీనివాసులు– నాగమణి దంపతుల కుమారుడు బుడిగె కార్తీక్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయాన్ష్ భార్గవ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నార్కట్ పల్లి మండలం చెరువుగట్టు పుణ్య క్షేత్రం లో పేదలకు అన్నప్రసాద కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయాన్ష్ భార్గవ్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పిట్టంపల్లి కి చెందిన గౌర నాగేందర్ సహకారం తో నిరుపేదలు, వృద్ధులు, అభాగ్యులకు అన్నదాన ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు నాగేందర్ మాట్లాడుతూ బుడిగె కార్తీక్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలతో పుట్టినరోజును జరుపుకోవడం అభినందనీయమన్నారు. అన్నదానం కంటే మించిన దానం లేదని, ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల వద్దకే వెళ్లి భూ సమస్యలకు పరిష్కారం చూపాలి
నల్లగొండ కలెక్టర్ చంద్రశేఖర్ కీలక ఆదేశం
గ్రామసభల్లో భూ సర్వే వివరా లతో పారదర్శక పరిష్కారం
బంజరుభూముల్లో మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్లు



ప్రజా దీవెన దేవరకొండ: రైతుల భూ సమస్యల పరిష్కారంలో జా ప్యం లేకుండా క్షేత్రస్థాయిలోనే ప రిశీలనలు జరిపి, రైతులతో నేరు గా మాట్లాడి సమస్యలకు పరి ష్కారం చూపాలని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారు లను ఆదేశించారు. భూ సర్వే వి వరాలను ప్రజలకు అందుబాటు లో ఉంచడంతో పాటు, గ్రామస భల్లో చదివి వినిపించాలని స్ప ష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావం నే పథ్యంలో నీటి వినియోగంలో జా గ్రత్తలు పాటించాలని, బంజరు భూములను సద్వినియోగం చే సుకొని మహిళా సంఘాలు సో లార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఆ దాయం పొందే అవకాశాలను ప రిశీలించాలని సూచించారు.

తెల్లవారుజామునే క్షేత్రస్థాయి పరిశీలన

దేవరకొండ నియోజకవర్గంలోని చందంపేట మండలం పొగిళ్ల, కం బాలపల్లి గ్రామాల్లో శుక్రవారం కలెక్టర్ పర్యటించి, భూ సర్వే ని ర్వహించిన ప్రాంతాలను పరిశీ లించారు. సూర్యోదయానికి ముందే గ్రామాలకు చేరుకున్న ఆ యన రైతులతో ముఖాముఖి మాట్లాడి భూముల విస్తీర్ణం, స ర్వే వివరాలు, రెవెన్యూ రికార్డు లు, పట్టాదారు పాసుపుస్తకాలు, రైతుల అభ్యంతరాలపై వివరా లు సేకరించారు.పొగిళ్ల గ్రామం లోని సర్వే నంబర్ 2లో మొత్తం 1,066 ఎకరాల భూమిని సర్వే చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. వాస్తవ సాగు భూ ములు, అసైన్డ్ భూములు, భూ ములపై హక్కులు కలిగిన రైతు ల వివరాలను ఆయన పరిశీ లిం చారు. సర్వేకు సంబంధించిన స మాచారాన్ని గ్రామంలో ప్రదర్శిం చడంతో పాటు, అవసరమైతే గ్రా మసభల్లో చదివి వినిపించాలని ఆదేశించారు.

30 అభ్యంతరాలపై సమగ్ర వి చారణ

పొగిళ్ల గ్రామంలో భూ సర్వేకు సంబంధించి ఇప్పటివరకు 30 అభ్యంతరాలు వచ్చినట్లు అధికా రులు తెలిపారు. ఈ అభ్యంతరా లను క్షుణ్ణంగా పరిశీలించి, పరి ష్కారానికి తీసుకున్న చర్యలను స్పష్టంగా వివరించాలని కలెక్టర్ సూచించారు. భూముల రికార్డు లు, పట్టాదారు పాసుపుస్తకాలు, పహాణీ వివరాలు, క్షేత్రస్థాయిలో ఉన్న భూమి విస్తీర్ణాన్ని పరస్పరం సరిపోల్చి పరిశీలించాలని ఆదే శించారు.భూములపై హక్కులు కోరుతున్న రైతులు తమకు సం బంధించిన ధ్రువపత్రాలను సమ ర్పించాలని సూచించారు. అసైన్డ్ భూముల చట్టవిరుద్ధ విక్రయాలు కొనుగోళ్లు చేయకూడదని స్పష్టం చేశారు. సర్వే ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటిస్తూ, రైతులకు వాస్తవ వివరాలు తెలియజేసిన అనంతరం అభ్యంతరాలపై నిర్ణ యం తీసుకోవాలని అధికారుల కు దిశానిర్దేశం చేశారు.

రైతులతో చర్చల ద్వారానే పరి ష్కారం

కంబాలపల్లి రైతు వేదికలో రైతు లతో సమావేశమైన కలెక్టర్ సర్వే నంబర్ల వారీగా భూ సర్వే పురోగ తిని సమీక్షించారు. సర్వే నంబ ర్లు 37, 50లకు సంబంధించిన వి వరాలను పరిశీలించి, పూర్తయి న సర్వే సమాచారాన్ని గ్రామ స భల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు.సర్వే రి కార్డుల్లోని వివరాలు, పహాణీలో నమోదైన పేర్లు, వాస్తవంగా భూ ములను సాగు చేస్తున్న రైతుల వివరాలను సరిపోల్చాలని ఆదే శించారు. భూముల విస్తీర్ణంలో తేడాలు ఉన్నా, రికార్డుల్లో వ్య త్యాసాలు కనిపించినా సంబంధి త రైతులు, అధికారులు కలిసి చ ర్చించుకోవాలని సూచించారు. అన్నదమ్ములు, ఇతర భూహక్కు దారుల మధ్య తలెత్తే వివాదా ల ను పరస్పర చర్చల ద్వారా పరి ష్కరించుకోవాలని తెలిపారు. సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేసి, అన్ని వివరాలు సక్ర మంగా ఉన్న అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం పట్టాదారు పాసుపుస్తకాలు అందేలా చర్య లు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఎల్‌నినో నేపథ్యంలో నీటి పాదు పే కీలకం

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతంలో మార్పు లు సంభవించే అవకాశం ఉన్నం దున రైతులు అప్రమత్తంగా ఉం డాలని కలెక్టర్ సూచించారు. భూ గర్భ జలాల లభ్యతను దృష్టిలో పెట్టుకొని పంటలకు అవసర మై న మేరకే నీటిని వినియోగించా లని, ప్రతి నీటి చుక్కను పొదుపు చేయాలని కోరారు.నీటి లభ్యత కు అనుగుణంగా తక్కువ నీటి తో సాగు చేయగల పంటలు, కూ రగాయల సాగుపై దృష్టి సారిం చాలని సూచించారు. పశుసం పదను సంరక్షించుకుంటూ, అం దుబాటులో ఉన్న వనరులను స మర్థవంతంగా వినియోగించుకో వడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచుకో వచ్చని తెలిపారు.

మహిళా సంఘాలకు సోలార్ ఆదాయ అవకాశాలు

గ్రామాల్లోని బంజరు భూముల ను వినియోగించుకొని మహిళా సంఘాలు సోలార్ ప్లాంట్లు ఏర్పా టు చేసుకునే అవకాశాలను పరి శీలించాలని కలెక్టర్ సూచించా రు. సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చే సి విక్రయించడం ద్వారా మహి ళా సంఘాలు ఆదాయం పెంచు కొని ఆర్థికంగా బలోపేతం కావ చ్చని తెలిపారు.అలాగే పశువుల పేడతో గోబర్ గ్యాస్ తయారీని ప్రోత్సహించాలని, తద్వారా ఇం ధన అవసరాలను తీర్చుకోవడం తో పాటు స్థానిక వనరులను స ద్వినియోగం చేసుకోవచ్చని పే ర్కొన్నారు. గ్రామీణ కుటుంబాలు అనవసర ఖర్చులను తగ్గించుకొ ని పొదుపు అలవాటును పెం పొందించుకోవాలని కలెక్టర్ పిలు పునిచ్చారు.ఈ పర్యటనలో రెవె న్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివా స్, దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలి యన్ చింగ్ థియాన్ మావి, ల్యాండ్ సర్వే ఏడీ దేవరాజ్, త హసీల్దార్ సత్యనారాయణ, పొగి ళ్ల సర్పంచ్ జటా జైహింద్ నాయ క్, కంబాలపల్లి సర్పంచ్ గోవిం దు, మండల సర్వేయర్లు శ్రీని వా స్, హరీష్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





వారసత్వ, ఆధ్యాత్మిక, పర్యావరణ పర్యాటక కేంద్రంగా పానగల్
పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు

ప్రజా దీవెన, నల్లగొండ టౌన్ : న ల్లగొండ జిల్లా కేంద్రంలోని చారి త్ర క పానగల్ శ్రీ ఛాయా సోమేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ ప ట్టనుంది. ఆలయంతో పాటు ప రిసర ప్రాంతాలను, సమీపంలోని జలవనరులను సమగ్రంగా సుం దరీకరించి అభివృద్ధి చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రూ.20 కో ట్ల పరిపాలనాపరమైన అనుమ తులు మంజూరు చేసింది. ఈ మేరకు యువజన పురోగతి, పర్యాటక, సాంస్కృతిక శాఖ 2026 అక్టోబర్ 19న జీఓ ఆర్టీ నంబర్ 311 జారీ చేసింది.

పర్యాటక అభివృద్ధికి ప్రత్యేక ప్ర ణాళిక

పానగల్‌ను నల్లగొండ జిల్లాలో ప్ర ముఖ వారసత్వ, ఆధ్యాత్మిక, ప ర్యావరణ పర్యాటక కేంద్రంగా తీ ర్చిదిద్దాలనే లక్ష్యంతో ఈ అభి వృద్ధి పనులకు ప్రభుత్వం ఆమో దం తెలిపింది. తెలంగాణ ప ర్యా టక అభివృద్ధి సంస్థ (టీఎఫ్‌డీసీ) ఇంజినీరింగ్ బృందం సంబంధిత ప్రాంతాలను పరిశీలించి, సుమా రు రూ.20 కోట్లతో ప్రాథమిక అం చనాలను రూపొందించింది. సం స్థ మేనేజింగ్ డైరెక్టర్ సమర్పించి న ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం నిధుల మంజూరుకు పరిపాలనాపరమైన అనుమతి ఇచ్చింది.

ఆలయ పరిసరాలకు కొత్త రూపు

ఈ ప్రాజెక్టులో భాగంగా శ్రీ ఛా యా సోమేశ్వర స్వామి ఆల యంతో పాటు పరిసర ప్రాంతా లు, సమీప జలవనరుల సుం దరీకరణ, అభివృద్ధికి చర్యలు చే పట్టనున్నారు. ఈ పనులు పూ ర్తయితే పానగల్‌కు వచ్చే భక్తు లు, పర్యాటకులకు మరింత మె రుగైన వాతావరణం అందుబా టులోకి వచ్చే అవకాశం ఉంది. స్థానికంగా పర్యాటక కార్యకలా పాలు పెరగడంతో పాటు ప్రాంతీ య ఆర్థికాభివృద్ధికి కూడా ఊ తం లభించవచ్చని భావిస్తున్నా రు.

తదుపరి చర్యలు చేపట్టనున్న టిజిటిడిసి

మంజూరైన రూ.20 కోట్లను ప ర్యాటక మౌలిక సదుపాయాల అ భివృద్ధి, కొత్త పర్యాటక యూనిట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న యూ నిట్ల అభివృద్ధి, ఆధునికీకరణకు కేటాయించిన ఖాతా నుంచి ఖ ర్చు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొ న్నారు. ప్రాజెక్టుకు సంబంధించి తదుపరి అవసరమైన చర్యలను హైదరాబాద్‌లోని తెలంగాణ ప ర్యాటక అభివృద్ధి సంస్థ మేనే జింగ్ డైరెక్టర్ చేపట్టనున్నారు.

చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలిగిన పానగల్ ప్రాంతాన్ని ప ర్యాటక పటంలో మరింత ప్ర ము ఖంగా నిలిపేందుకు ఈ నిధుల మంజూరు కీలక ముందడుగుగా నిలవనుంది. అయితే పనుల ప్రా రంభం, పూర్తి చేసే గడువు వంటి వివరాలు తదుపరి కార్యాచరణ లో వెల్లడికావాల్సి ఉంది.



IAS, IPS కావాల్సిన బిడ్డల్ని... రాజకీయ వారసులుగా ఎందుకు మారాలనీ అనుకుంటున్నారు..?

కచ్చిర్ కాడి ముచ్చట్లు..

చదివినోడు.... చదువు కన్నా పలుకుబడున్నోడు పెత్తనం ముందు " ఎస్ సర్ " అనాలే....! ఇయ్యాల మనూరు కచ్చిర్ కాడి ముచ్చట్ల ఎజెండా కొంచెం ఘాటుగనే ఉంటది. ఎందుకంటే ఇది ఒక కుటుంబానికి సంబంధించిన ముచ్చట కాదు..మన సమాజం ఆలోచనా విధానానికి సంబంధించిన ముచ్చట!

ఒక బిడ్డ IAS కావాలంటే ఏండ్ల తరబడి చదవాలె..! IPS కావాలంటే కఠినమైన పరీక్షలు దాటాలె..!

కానీ ఒక నాయకుడి వారసుడిగా రాజకీయాల్లోకి రావాలంటే ఆ కుటుంబంపేరు, పలుకుబడి, రాజకీయ పరిచయాలు చాలాసార్లు అదనపు అవకాశాలు కల్పిస్తాయి.. ఇదేనా.....! మన సమాజంల పెరుగుతున్న అసమానత? ఒక్కసారి దిమాకుతో ఆలోచించుండ్రి...! చదువుకోమని చెప్పాల్సిన తల్లిదండ్రులే..! పిల్లలను రాజకీయాల వైపు ఎందుకుమల్లమని ప్రోత్సహిస్తున్నారు ఇందులోనే దాగి ఉంది అసలు మతాలబ్....! ఒకప్పుడు తల్లిదండ్రులు తమ పిల్లలు బాగా చదువుకొని కలెక్టర్ కావాలె, IAS కావాలె, IPS కావాలె, ఉన్నతాధికారులుగా ఎదగాలె అని కలలు కనేటోళ్లు. పిల్లల భవిష్యత్తు కోసం అప్పులు చేసి మరీ చదివించేటోళ్లు. రాత్రింబవళ్లు కష్టపడి చదివి ఉద్యోగం సాధిస్తే తమ కుటుంబం తలెత్తుకొని బతుకుతదని ఆశపడేటోళ్లు.... మరి ఇయ్యాల కొంతమంది తల్లిదండ్రుల ఆలోచనల్లో రాజకీయ పదవుల మీద ఆకర్షణ ఎందుకు పెరుగుతున్నది?

"సదువుకొని ఏం సాధిస్తవురాబిడ్డా.....! రాజకీయాల్లోకిరా.....! నాయకుడివి అవ్వు! నలుగురిని వెంటేసుకో! పదవి సంపాదించు! పలుకుబడి పెంచుకో!" అనే ఆలోచన ఎందుకు బలపడుతున్నది? ప్రశ్నించాల్సింది రాజకీయాలను కాదు.. రాజకీయాలనే అధికారం, హోదా, పలుకుబడికి సులభమైన దారిగా చూసే మనస్తత్వాన్ని! రాజకీయాలు కూడా ప్రజాసేవకు గొప్ప వేదికే. కానీ ప్రజాసేవ పక్కకు పోయి పదవులే ప్రధాన లక్ష్యంగా మారితేనే అసలు సమస్య మొదలైతది.

IAS, IPS అధికారులే నాయకుల ముందు అణిగిమణిగి ఉండాలా?

ఒక IAS అధికారి కావాలంటే దేశంలోనే అత్యంత కఠినమైన పోటీ పరీక్షల్లో ఒకటైన సివిల్ సర్వీసెస్ పరీక్షలో నెగ్గాలె. IPS కావాలంటే కూడా ప్రతిభ, క్రమశిక్షణ, శిక్షణతో ముందుకు రావాలె.....!

ఎన్నో ఏండ్ల కష్టం, కుటుంబ త్యాగం, వ్యక్తిగత పట్టుదల వెనక ఉంటయి. కానీ అధికార బాధ్యతలు నిర్వహించే సందర్భంలో ఒక అధికారి ప్రజాప్రతినిధికి గౌరవం ఇవ్వాల్సి వస్తది. అది ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగం. అయితే ఆ గౌరవాన్ని వ్యక్తిగత బానిసత్వంగా మార్చే ప్రయత్నం జరిగితే మాత్రం ప్రశ్నించాల్సిందే! ప్రజాప్రతినిధి అంటే ప్రజల తరఫున పనిచేసే నాయకుడు. అధికారి అంటే చట్టాన్ని అమలు చేసే బాధ్యతగల ప్రభుత్వ ఉద్యోగి.

ఇద్దరూ ప్రజల కోసమే పనిచేయాలె.....!

మరి ఒకరు మరొకరిని తక్కువ చేసి చూసే హక్కు ఎవరిచ్చిన్రు? అధికారి చట్టానికి కట్టుబడి ఉండాలె.....! నాయకుడు కూడా చట్టానికి లోబడే పనిచేయాలె.....! నాయకుడి మాట చట్టం కాదు.

అధికారం ఉన్నంత మాత్రాన ఎవరూ ప్రశ్నలకు అతీతులు కారు. మరి మన పిల్లలకు ఏం నేర్పిస్తున్నం? అధికారిగా ఎదిగి వ్యవస్థను నడిపించమంటున్నమా? లేక పలుకుబడి సంపాదించి అధికారుల చేత దండాలు పెట్టించుకునే స్థాయికి ఎదగమంటున్నమా? ఈ ప్రశ్న ప్రతి తల్లిదండ్రి తనను తాను వేసుకోవాల్సిందే.....!

రాజకీయ వారసత్వం.. ప్రజాస్వామ్యమా....?

కుటుంబ ఆధిపత్యమా...? దేశ రాజకీయాలను, రాష్ట్ర రాజకీయాలను గమనించుండ్రి. అనేక రాజకీయ కుటుంబాల్లో ఒక తరం తర్వాత మరో తరం నాయకత్వంలోకి వస్తున్నది. తండ్రి తర్వాత కొడుకు, తల్లి తర్వాత కూతురు, కుటుంబంలోని ఇతర సభ్యులు కూడా రాజకీయాల్లోకి వస్తున్న సందర్భాలు కనిపిస్తున్నయి. ఇందులో తప్పేముంది అని కొందరు అడగొచ్చు. ప్రజాస్వామ్యంలో రాజకీయ కుటుంబాలకు చెందినవాళ్లు కూడా పోటీ చేయొచ్చు.

ప్రజలు ఎన్నుకుంటే పదవులు చేపట్టొచ్చు.

అందులో సందేహం లేదు. కానీ అసలు ప్రశ్న అదికాదు....! సామాన్యుడి బిడ్డకు, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబం బిడ్డకు ఒకే స్థాయి అవకాశాలు ఉన్నాయా? ఒక సామాన్య కుటుంబం బిడ్డ రాజకీయాల్లోకి రావాలంటే ప్రజల్లో గుర్తింపు సంపాదించాలె.....! ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాలె. పార్టీ నాయకత్వం దగ్గర అవకాశాల కోసం ప్రయత్నించాలె.

ఎన్నికల్లో పోటీ చేయాలంటే డబ్బు, ప్రచారం, కార్యకర్తలు వంటి ఎన్నో సవాళ్లు ఎదురవుతయి.

రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబాలకు మాత్రం పేరు, పరిచయాలు, సంస్థాగత సంబంధాలు వంటి ప్రయోజనాలు ముందే అందుబాటులో ఉండొచ్చు.

అందుకే అడుగుతున్నం....!

ప్రజాస్వామ్యం అంటే ప్రజలందరికీ రాజకీయాల్లో ఎదిగే అవకాశం ఉండటమా? లేక రాజకీయాల్లో ఉన్న కుటుంబాల వారసులకే అవకాశాలు సులభంగా దక్కటమా? ప్రజల ఓటుతో గెలవడం ఒక విషయం.

ప్రజల ముందుకు వచ్చే అవకాశాలే కొందరి చేతుల్లో ఎక్కువగా కేంద్రీకృతం కావడం మరో విషయం. ఈ తేడా గురించి మాట్లాడితే తప్పేంటి? చదువుకున్నోడు ఉద్యోగం కోసం పరీక్ష రాయాలె..! రాజకీయ వారసుడికి మాత్రం వారసత్వమే అర్హతా...? ఒక యువకుడు ప్రభుత్వ ఉద్యోగం కోసం పోటీ పరీక్ష రాస్తే అతడి ప్రతిభను పరీక్షిస్తరు. అర్హతలు చూస్తరు. ఎంపిక ప్రక్రియలో నిబంధనలు పాటించాలె.....! కానీ రాజకీయాల్లో వారసత్వంగా వచ్చే అవకాశాల విషయంలో మనం అదే ప్రశ్న అడుగుతున్నమా? నాయకుడి బిడ్డ కాబట్టి నాయకుడే కావాల్నా? రాజకీయ కుటుంబంలో పుట్టినంత మాత్రాన ప్రజలకు సేవ చేసే అర్హత వచ్చినట్టేనా? సామాన్య కుటుంబంలో పుట్టినంత మాత్రాన నాయకత్వానికి దూరంగా ఉండాల్నా? రాజకీయ నాయకత్వం ఎవరి కుటుంబ ఆస్తి కాదు. ప్రజాస్వామ్యంలో అది ప్రజల విశ్వాసంతో సంపాదించాల్సిన బాధ్యత! నాయకుడి వారసుడు రాజకీయాల్లోకి రావొచ్చు. కానీ అతడిని ప్రజలు అతను చేస్తున్న సేవ పనులు,నిబద్ధత, ప్రజలతో సంబంధం, జవాబుదారీతనం ఆధారంగా అంచనా వేయాలి. అదే కొలమానం సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన నాయకులకూ వర్తించాలి.

తల్లిదండ్రులారా.....!

పిల్లలకు పదవుల వెనుక పరిగెత్తడం కాదు.....

విలువలతో ఎదగడం నేర్పించుండ్రి....! మీ బిడ్డ IAS కావాలనుకుంటే ప్రోత్సహించుండ్రి. IPS కావాలనుకుంటే అండగా నిలబడుండ్రి. శాస్త్రవేత్త కావాలన్నా, డాక్టర్ కావాలన్నా, ఉపాధ్యాయుడు కావాలన్నా, వ్యాపారవేత్త కావాలన్నా వారి కలలకు దారి చూపించుండ్రి. రాజకీయాల్లోకి రావాలనుకుంటే కూడా ప్రోత్సహించుండ్రి. కానీ ప్రజల సమస్యలు అర్థం చేసుకోమని చెప్పుండ్రి. ప్రజల హక్కుల కోసం నిలబడమని నేర్పించుండ్రి. అధికారాన్ని సేవకు ఉపయోగించమని చెప్పుండ్రి.

పిల్లలకు ఒక విషయం మాత్రం గట్టిగా చెప్పుండ్రి....

బిడ్డా....! పెద్ద పదవిలో ఉండటం గొప్ప కాదు.

ఆ పదవిని ఉపయోగించి ప్రజలకు ఎంత మేలు చేశావన్నదే గొప్ప..

IAS అయినా, IPS అయినా, ఎమ్మెల్యే అయినా, ఎంపీ అయినా.. ప్రజల పట్ల బాధ్యత లేకపోతే...!

ఆ పదవికి అర్థం లేదు.

ప్రజల కోసం పనిచేసే చిత్తశుద్ధి ఉంటే ఏ రంగంలో ఉన్నా సమాజానికి ఉపయోగపడొచ్చు.

చివరగా.. కచ్చిర్ కాడి ముచ్చట్ల నుంచి సూటి ప్రశ్న..?

మన సమాజంలో చదువుకున్న యువతకు ఉద్యోగాలు రావాలి. ప్రతిభకు గుర్తింపు రావాలి.

రాజకీయాల్లోకి వచ్చే సామాన్య యువతకు కూడా సమాన అవకాశాలు ఉండాలి. రాజకీయ వారసత్వం ఉన్నవాళ్లూ తమ పనితోనే ప్రజల విశ్వాసాన్ని సంపాదించాలి. అధికారులు నాయకుల వ్యక్తిగత ఆదేశాలకు కాదు, చట్టానికి కట్టుబడి పనిచేయాలి. నాయకులు అధికారాన్ని వ్యక్తిగత హోదాగా కాకుండా ప్రజలు అప్పగించిన బాధ్యతగా చూడాలి. ఎందుకంటే....? ప్రజాస్వామ్యంలో నాయకుడు ప్రజల కంటే పైవాడు కాదు..... ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రజాప్రతినిధి మాత్రమే ....!

ఇగ మీరే చెప్పుండ్రి...!

ఒక బిడ్డ IAS, IPS అయి చట్టబద్ధంగా ప్రజలకు సేవ చేయాలనే కల కనడం గొప్పదా? రాజకీయాల్లోకి వచ్చి ప్రజల సమస్యల కోసం పోరాడాలనే లక్ష్యం గొప్పదా? రెండింటినీ గౌరవించే సమాజాన్ని నిర్మించడం గొప్పదా? మనకు కావాల్సింది ఏ రంగంలో ఉన్నా బాధ్యతతో పనిచేసే యువత. కుటుంబ పేరు మీద కాకుండా తన ప్రతిభ, తన పనితో గుర్తింపు తెచ్చుకునే తరం. పదవి కోసం రాజకీయాలు వద్దు.. ప్రజల కోసం రాజకీయాలు కావాలి! వారసత్వంతో వచ్చిన హోదా కాదు..

ప్రజల విశ్వాసంతో సంపాదించిన గౌరవమే నిజమైన నాయకత్వం!

ఇదే ఇయ్యాల మన కచ్చిర్ కాడి ముచ్చట్ల ఘాటు ప్రశ్న.....!

ఆలోచించుండ్రి.. చర్చించుండ్రి.. మన పిల్లలకు ఎలాంటి సమాజాన్ని అందించాలనుకుంటున్నమో నిర్ణయించుండ్రి!

IAS అయినా...! అయ్యా అనే భ్రమల నుంచి తల్లి తండ్రులు బయటపడాలి... తమ బిడ్డలు రాజ్యాంగానికి కట్టుబడి విధి నిర్వహణలు చేసి ప్రజా మన్ననలు పొందితే....! రాజకీయ నాయకుని హోదా కంటే అత్యున్నత హోదా మీదే బిడ్డా అని హితవు చెప్పండి. IAS, IPS, పోస్టుల్లో ఉన్న బిడ్డలు మీరు కుల రహిత, అవినీతి, అక్రమార్జన రహిత, నిరఫరాదికి న్యాయం జరిగేలా సేవలు చేయండి అప్పుడే అందరూ కోరుకుంటున్న మెరుగైన సమాజం ఏర్పడుతుందని ఉద్బోధించండి.

చెప్పాల్సింది చాలా ఉంది....

చదవాల్సింది మిగిలే ఉంది...

- సకినాల సుధాకర్ పటేల్.
సీనియర్ జర్నలిస్టు.

రానున్న పది నెలలు తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్



ప్రజా దీవెన దేవరకొండ: రానున్న పది నెలల పాటు గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, ప్రతి నీటి చుక్కను పొదుపుగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ సర్పంచులు, గ్రామ కార్యదర్శులతో కోరారు. గ్రామాల్లో పైపులైన్ లీకేజీలు ,ఇతరత్రా నీటి వృధా లేకుండా నివారించి నీటి వృధా లేని గ్రామాలుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ కోరారు. శుక్రవారం దేవరకొండా లోని ఒక ప్రయివేట్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో "ఎల్‌నినో ప్రభావం– తీసుకోవలసిన చర్యలపై సర్పంచులు, గ్రామ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎల్ నినో వల్ల వాతావరణ మార్పుల ప్రభావంతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో నీటి వనరులను కాపాడుకోవడం అత్యంత అవసరమన్నారు. గ్రామాల్లో చెరువులు, మిషన్ భగీరథ, బోర్లు, కాలువలు, వర్షపు నీటి ద్వారా లభించే నీటి నిల్వలపై ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని గ్రామాలలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, నీటి నిల్వల వివరాలను గ్రామ కార్యదర్శులు తెలుసుకుని, వాటిని రానున్న నెలల్లో అవసరాలకు సరిపడా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. జూలై వరకు నీటి కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. నీటి సంరక్షణ చర్యలలో భాగంగా గ్రామాలలో పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. తాగునీరు, సాగునీటికి ఎంత అవసరమో అంతే వినియోగిస్తూ నీటి పొదుపు సూత్రాలను ప్రజలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. విద్యుత్తును కూడా పొదుపుగా వినియోగించి సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టర్ కోరారు. రానున్న రోజుల్లో తక్కువ నీటితో పండించే ఆరుతడి పంటలైన సజ్జలు, జొన్నలు, మినుములు, కందులు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సుమారు 30 మంది రైతులు ఒక సమూహంగా ఏర్పడి సమిష్టి వ్యవసాయం చేపట్టేలా ప్రోత్సహించాలని, పండించిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో కూలీలకు పని కల్పించాలని, పశుసంపదను సంరక్షిస్తూ పశువులకు తాగునీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. మహిళా సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామాలలో ఉపాధి పనులను విస్తృతంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ఎంపీడీవోలు పర్యవేక్షణ బాధ్యత తీసుకోవాలని చెప్పారు. చేపట్టిన పనులకు కొలతల పుస్తకాల ప్రకారం బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రజలకు అవసరమైన రేషన్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా కొత్త పంచాయతీల్లో రేషన్ షాపుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలలకు సంబంధించిన పెండింగ్ బిల్లుల పరిష్కారానికి కూడా చర్యలు చేపడతామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావాన్ని ప్రకృతి వైపరీత్యంగా భావించి, సమష్టి కృషితో ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అనంతరం కలెక్టర్ సర్పంచులతో కలిసి క్రింద కూర్చుని వారి సమస్యలను అడిగి తెలుసుకుని, పరిష్కారానికి చర్యలు తీసుకుం టామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎల్‌నినో ప్రభావం నివారణ, నీటి పొదుపుపై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో దేవరకొండ సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్తి యాన్ మావి,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్ , పశు సంవర్ధక శాఖ అధికారి జివి రమేష్, డిపిఓ తరుణ్ చక్రవర్తి, ఇంచార్జ్ఎంపీడీవో పార్వతి, అధికారులు, సర్పంచులు, సెక్రటరీలు పాల్గొన్నారు.





కోతుల భయంతో వల్లాపురంలో 12ఏళ్ల బాలుడి మృతి



ప్రజా దీవెన, నడిగూడెం: కోతుల దాడి నుంచి తప్పించు కునేందుకు పరుగులు తీసిన బాలుడు కిందపడి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని వల్లా పురంలో శుక్రవారం చోటుచేసు కుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం... మొక్క వీరబాబు దంప తుల కుమారుడు నిశాంత్ (12) దసరా సెలవుల్లో అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. అయితే శుక్రవారం అమ్మమ్మ ఇంటి వద్ద నుంచి స్నేహితుడితో కలిసి అదే గ్రామంలో ఉన్న తమ సొంత ఇంటికి వెళ్తున్న క్రమంలో కోతులు వెంబడించాయి. దీంతో భయాందోళనకు గురైన నిశాంత్ వాటి నుంచి తప్పించుకునేందుకు పరుగెత్తుతూ అదుపుతప్పి కింద పడి పోమాడు. గమనించిన స్థానికులు వెంటనే నిశాంత్ ను ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భయంతో బాలుడి గుండె ఆగిపోవడం వల్లే చనిపోయాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని నడిగూడెం ఎస్సై తేజస్విని తెలిపారు.

జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

ఉద్యమకారులపై అక్రమంగా పెట్టిన కేసులు ఎత్తివేయాలి.: రాములు



ప్రజా దీవెన, కోదాడ : భారత ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు శుక్రవారం స్థానిక రంగా థియేటర్ సెంటర్లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జ్ఞానేష్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు అనంతరం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ సర్కార్ రాజ్యాంగ హక్కులను ఉల్లంఘిస్తూ భారత ఎలక్షన్ ప్రధాన అధికారి జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓట్లు రద్దు అయినాయి అని రాములు అన్నాడు మోడీ సర్కారు నాలుగోసారి అధికారంలోకి రావడం కోసం కీలుబొమ్మలాంటి జ్ఞానేష్ కుమార్ అడ్డం పెట్టుకొని 14 కోట్ల ఓట్లు తొలగించారని ఆయన విమర్శించారు దేశంలో చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియమించడంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉంటారని పార్లమెంట్లో తన మంది బలాన్ని ఉపయోగించుకొని చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియామకంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి తొలగించి తన మంత్రిని పెట్టుకొని మోడీ సర్కార్ తన ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు ప్రజాస్వామ్యం కోసం ఓటు హక్కు కోసం పోరాడుతున్న నాయకుల పైన లాటి చార్జీ అక్రమ కేసులు మోపుతున్నారని అని విమర్శించారు తక్షణమే అక్రమ కేసులు ఎత్తివేయాలని జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మీద వెంకటేశ్వరరావు సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకటనారాయణ సిఐటియు పట్టణ కన్వీనర్ ఎం ముత్యాలు కౌల్దారు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు షేక్ సైదా ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జూలకంటి విజయలక్ష్మి రైతు సంఘం నాయకులు అలసగాని బ్రహ్మయ్య రాపోలు సూర్యనారాయణ నాగాటి రాములు రాములు సోంపంగు రాధాకృష్ణ జంగాపల్లి శీను కలయాసన్ తదితరులు పాల్గొన్నారు

అధికారులకు రెండో రోజు శిక్షణా తరగతులు



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: జనగణన నిర్వహణకు సంబం ధించి జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు, చార్జ్ ఆఫీసర్లు, అదనపు చార్జ్ ఆఫీసర్లకు శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెండో రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా కార్యక్రమంలో తహసీల్దార్లు (చార్జ్ ఆఫీసర్లు), ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు (అదనపు చార్జ్ ఆఫీసర్లు)తో పాటు జిల్లా, డివిజనల్ స్థాయి అధికారులు పాల్గొన్నారు. జనగణన ప్రక్రియను సమర్థవం తంగా నిర్వహించేందు కు అధికా రులకు అవసరమైన అవగాహన కల్పించడం, విధివిధానాలపై శిక్ష ణ అందించడం జరిగిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

పానగల్ ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రూ.20 కోట్లు మంజూరు

సీఎం,మంత్రి జూపల్లికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు

సీఎం సహకారంతో యునెస్కో గుర్తింపు దిశగా కృషి చేస్తా

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



ప్రజా దీవెన, హైదరాబాద్: నల్లగొండ జిల్లా కేంద్రం లోని పానగల్‌లోని చారిత్రక ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేయడం పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచిన ఛాయా సోమేశ్వరాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ప్రపంచస్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. ప్రపంచస్థాయిలో ఎక్కడ లేని విధంగా "వందల ఏళ్ల క్రితమే శిల్పులు కాంతి, నీడ, నిర్మాణ శాస్త్రాన్ని సమన్వయం చేసి శివలింగంపై నిరంతర ఛాయ కనిపించేలా నిర్మించిన ఛాయా సోమేశ్వరాలయం తెలంగాణ శిల్పకళా వైభవానికి, ప్రాచీన నిర్మాణ విజ్ఞానానికి అద్భుత నిదర్శనమన్నారు. ఆలయానికి యునెస్కో గుర్తింపు తీసుకురావడానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధికి రూ. 20 కోట్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావులకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో చారిత్రక వారసత్వాన్ని కాపాడటంతో పాటు మరింత పర్యాటక ప్రాధాన్యత తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. మంత్రి చొరవతో ఆలయ అభివృద్ధి నిధులు విడుదల కావటంలో భక్తులు,స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నల్లగొండ జిల్లా చండూరు వాసికి ఎంజియు పిహెచ్ డి

ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: పరి శోధనపై ఆసక్తితో ఉన్నత విద్య లో ముందడుగు వేశారు రుద్ర వా ణి గాయత్రి. నల్లగొండ జిల్లా చం దూరుకు చెందిన ఆమె మహా త్మాగాంధీ విశ్వవిద్యాలయం మే నేజ్‌మెంట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డా. సూరం శ్వేత పర్య వేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. 'తెలంగాణ రాష్ట్రంలోని ఎంపిక చేసిన ఉన్నత విద్యాసంస్థల ఉ ద్యోగుల భావోద్వేగ ప్రజ్ఞ, ఒత్తిడి నిర్వహణ పద్ధతులు' అనే అం శంపై పరిశోధన చేసి తన థెసిస్ ను సమర్పించారు. అధ్యాపకుల భావోద్వేగ ప్రజ్ఞ, ఒత్తిడి నిర్వ హ ణ పద్ధతులు, వారు అనుభవిస్తు న్న ఒత్తిడి మధ్య సంబంధాలను ఈ అధ్యయనంలో పరిశీలించారు. అధ్యాపకుల్లో భావోద్వేగ ప్రజ్ఞ మధ్యస్థాయిలో ఉన్నట్లు గుర్తించారు. ఒత్తిడిని ఎదుర్కొనేందుకు వారు పరిస్థితులకు అనుగుణంగా సానుకూల పద్ధతులను అనుసరిస్తున్నట్లు వెల్లడైంది. భావోద్వేగ ప్రజ్ఞకు, ఒత్తిడి నిర్వహణ పద్ధతులకు మధ్య సంబంధం ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. అధ్యాపకులు ఎదుర్కొంటున్న ఒత్తిడిని విద్యాసంస్థలు గుర్తించి, వారి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వాలని పరిశోధన సూచించింది. సంస్థాగత సహకారంతోపాటు మానసిక మద్దతు అందించాల్సిన అవసరాన్ని వివరించింది. ఈ పరిశోధన ఆధారంగా రూపొందించిన ఆరు పరిశోధనా పత్రాలు ప్రతిష్టాత్మకమైన స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్‌లో సూచీకరించిన వివిధ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. పరిశోధన కోసం ఆమెకు భారతీయ సామాజిక శాస్త్ర పరిశోధన మండలి (ఐసీఎస్ఎస్ఆర్) డాక్టోరల్ ఫెలోషిప్ లభించింది.భువనగిరి, నల్లగొండల్లో పాఠశాల విద్యను అభ్యసించిన వాణి గాయత్రి మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె తల్లి రుద్ర పద్మావతి, తండ్రి రుద్ర వెంకటేశం దేవాదాయ శాఖలో కార్యనిర్వహణాధికారిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్, మేనేజ్‌మెంట్ విభాగ అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



భజన బృందానికి భజన తాళాలు అందజేత

భజనలు భక్తి భావాన్ని పెంపొందిస్తాయి

సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి కళాసమితి అధ్యక్షులు అశ్విని చంద్రశేఖర్



ప్రజా దీవెన, దేవరకద్ర: ప్రతి ఒక్కరిలో భజన కార్యక్ర మాలు భక్తి భావాన్ని పెంపొంది స్తాయని సద్గురు శ్రీ త్యాగరాజ స్వామి కళా సమితి అధ్యక్షులు లయన్ అశ్విని చంద్రశేఖర్ అన్నారు. దేవరకద్ర మండలం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన భజన బృందం సభ్యులకు శు క్రవారం అశ్విని చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో భజన తాళాలను వితరణ గా అందించారు. ఈ సందర్భంగా అశ్విని చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు భజన కార్యక్రమాలు ఎంతగానో దోహదం చేస్తున్నాయని అన్నారు. యాంత్రిక యుగంలో మనిషిలో ఒత్తిడిని , ఆందోళనలు దూరం చేసేందుకు భజనలు తోడ్పాడుతాయని అన్నారు. భజన కార్యక్రమాలు సోదర భావాన్ని , ఐక్యతను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో భజన బృందం సభ్యులు రాజన్న గౌడ్, బి సాయిలు, చిన్నయ్య, బాల కొండయ్య, జంగ బుచ్చన్న, వాకిటి రాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరును పెంచాలి

హౌసింగ్, విద్యా రుణాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

రుణాల పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్





ప్రజా దీవెన నల్లగొండ టౌన్: నల్లగొండ జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన రు ణాల మంజూరును పెంచాలని, గృహ నిర్మాణ, విద్యా రుణాలపై బ్యాంకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించి ఆర్థికంగా తోడ్పాటు అందించాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సంప్రదింపుల కమిటీ (డీసీసీ) సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లాలో బ్యాంకుల పనితీరు, రుణాల మంజూరు, వివిధ సంక్షేమ కార్పొరేషన్ల కు సంబంధించిన పెండింగ్ రుణ దరఖాస్తులపై సమీక్షించారు.జిల్లాలో ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి గృహ నిర్మాణ రుణాలు, విద్యా రుణాల మంజూరు తక్కువగా ఉందని, వాటిని పెంచేందుకు బ్యాంకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. అర్హులైన విద్యార్థులకు ఉన్నత విద్య కోసం, ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు గృహ రుణాలు సకాలంలో అందేలా చూడాలని అన్నారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్, గిరిజన సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేయాల్సిన రుణాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు శిక్షణ పొందిన యువతకు స్వయం ఉపాధి కి బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని అన్నారు.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా బ్యాంకు అధికారులు తగిన సహకారం అందించాలని కలెక్టర్, రైతులకు రుణాల మంజూరులో అనవసర జాప్యం చేయకూడదని, ప్రభుత్వం నుండి వచ్చే ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ అర్హులైన రైతులకు రుణాలు అందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు సమన్వయంతో పనిచేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణ సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి , ట్రైనీ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఆర్బిఐ ఎల్డీఓ ప్రదీప్, నాబార్డ్ డీడీఎం వినయ్ కుమార్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి , ఎల్డిఎం శ్రామిక్, కోపరేటివ్ బ్యాంక్ సీఈవో శంకరరావు , జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు

ప్రైవేట్ సంస్థల్లో మహిళల భద్రతకు పెద్దపీట

POSH చట్టం--2013 అమలు తప్పనిసరి

ఎస్‌పీటీ మార్కెట్‌లో అవగాహన కార్యక్రమం



ప్రజా దీవెన నల్లగొండ టౌన్: ప్రైవేట్ సంస్థల్లో పనిచేసే మ హిళల కు సురక్షితమైన, గౌరవ ప్రదమైన పని వాతావరణాన్ని కల్పించడం యాజమాన్యాల బాధ్యత అని, మహిళలపై లైంగిక వేధింపుల ని వారణక్కూాూాన చట్టం --201 3ను తప్ప నిసరిగా అమలు చే యాలని అవగాహన కార్యక్రమం లో అధికారులు సూచించారు. నల్లగొండలోని ఎస్‌పీటీ మార్కె ట్‌లో వస్త్ర దుకాణాల యజమా నులు, ఉద్యోగులకు పని ప్రదే శాల్లో మహిళలపై జరిగే లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిష్కార చట్టం గ్రూాూాష్--2013)పై జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు.

ప్రతి సంస్థలో ఫిర్యాదుల కమిటీ తప్పనిసరి

ఈ సందర్భంగా అధికారులు మా ట్లాడుతూ 10 మంది లేదా అం తకంటే ఎక్కువ మంది ఉద్యోగు లు పనిచేసే ప్రతి సంస్థలో అంత ర్గత ఫిర్యాదుల కమిటీ (Inte rnal Complaints Committ ee-ICC) ఏర్పాటు చేయాలని తెలిపారు. 10 మంది కంటే తక్కువ ఉద్యోగులున్న సంస్థల్లో లైంగిక వేధింపుల సమస్యలు ఎదురైతే స్థానిక ఫిర్యాదుల కమిటీని (Local Complaints Committee-LCC) సంప్రదించవచ్చని వివరించారు. ప్రైవేట్ సంస్థల యాజమాన్యా లు, ఉద్యోగులు POSH చట్ట నిబంధనలను పాటించాలని, అంతర్గత ఫిర్యాదుల కమిటీ వివరాలను SHe-Box పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యాలయాల్లో మహిళలు ఎలాంటి లైంగిక వేధింపులకు గురైనా భయపడకుండా ఫిర్యాదు చేయాలని, వారి గౌరవం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.

వేధింపులు ఎదురైతే భయపడొద్దు.. ఫిర్యాదు చేయండి

మహిళలకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడంలో ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు పిలుపునిచ్చారు.

సమస్యలు ఎదురైనప్పుడు టోల్‌ఫ్రీ నంబర్ 181కు కాల్ చేయవచ్చని, SHe-Box పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు చేసే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం (WCD & SC Department)కు చెందిన చి. శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సయ్యద్ మొయిజుద్దీన్, వస్త్ర దుకాణాల యజమానులు, ఉద్యోగులు, ఇతరులు పాల్గొన్నారు.

ఆంగ్ల నైపుణ్యంతో మెరుగైన అవకాశాలు

మహాత్మా గాంధీ యూనివర్సిటీ ఉపకులపతి ఖాజా అల్తాఫ్ హుస్సేన్



ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకా శాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులు ఆంగ్ల భాషా నైపు ణ్యాలను పెంపొందించుకో వా ల ని మహాత్మాగాంధీ విశ్వవిద్యాల య ఉపకులపతి ప్రొఫెసర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం రూపొందించిన 'ఇంగ్లిష్ ఫర్ ఎఫెక్టివ్ ఎక్స్‌ప్రెషన్' పాఠ్య పుస్తకాన్ని శుక్రవారం తన కార్యా లయంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అంజిరెడ్డితో కలిసి ఆయన ఆవి ష్కరించారు.ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంగ్లాన్ని కేవలం పాఠ్యాంశంగానే కాకుండా, విద్యా ఉద్యోగ అవకాశాలను అందుకు నేందుకు ఉపయోగపడే నైపు ణ్యంగా అభ్యసించాలని సూచిం చారు. సాహిత్యం విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలు, నైతికత, పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పాఠ్యపుస్తక రూపకల్పనలో కృషి చేసిన సంపాదకులు, రచయిత లు, సహకరించిన బృందాన్ని అభినందించారు.ఈ పాఠ్యపు స్తకానికి డాక్టర్ కె. అరుణప్రియ, ప్రొఫెసర్ బి. విజయ సంపాద కు లుగా వ్యవహరించా రు. డాక్టర్ రాహత్ ఖానం, బి. లీలారాణి, లెఫ్టినెంట్ సీహెచ్. సుధాకర్ రచయితలుగా సహకరించారు.



నల్లగొండ జిల్లాలో ఓపెన్ హౌస్

ప్రజా దీవెన, నల్లగొండ టౌన్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా ఎ స్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశా లతో జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌ స్ కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులకు పోలీస్ శాఖ పని తీరు, నేర నియంత్రణ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియో గం,భద్రతా పరికరాలపై అవగాహన కల్పించారు. ఐటీ సెల్, బాంబ్ డిస్పోజల్,సైబర్ క్రైమ్, ఫింగర్ ప్రింట్స్,డాగ్ స్క్వాడ్ తదితర విభాగాల పనితీరును వివరిం చారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మోసపోతే 1930కు కాల్ చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ రమేష్ మాట్లాడుతూ అమర వీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని, యువతలో దేశభక్తి,చట్టాల పట్ల గౌరవం పెంచడమే లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు నాగ రాజు, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐ సైదాబాబు, ఆర్ఐ సంతోష్ పాల్గొన్నారు.



300వ టీ20 మైలురాయిపై భారత్ గురి

సూర్యవంశీ రీఎంట్రీపై ఉత్కంఠ!

న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉన్న భారత్

వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరం

దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు

అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే చాన్స్

బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని చూస్తోన్న కివీస్

టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్ మరో రికార్డు ముంగిట నిలిచింది. న్యూజిలాండ్‌తో రేపు జరిగే రెండో టీ20లో బరిలోకి దిగడం ద్వారా టీమిండియా 300 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా చరిత్ర సృష్టించనుంది. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తిరిగి తుది జట్టులోకి వస్తాడా? అన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉన్న భారత్.. రెండో మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేయాలని చూస్తోంది. తొలి టీ20లో ఇదే హోగ్లీ ఓవల్ మైదానంలో భారీ లక్ష్యాన్ని ఛేదించి గెలిచిన భారత జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.



సూర్యవంశీకి అవకాశం దక్కేనా?

తొలి మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన భారత జట్టులో బ్యాటర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్ కీలక పాత్ర పోషించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ టీ20ల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. అయితే రెండో మ్యాచ్‌కు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరమయ్యాడు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్ ఆడటం లేదు. దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే వీలుంది. అప్పుడు సంజూ శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తుది జట్టు కూర్పుపై భారత జట్టు యాజమాన్యం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అదే పిచ్.. బౌలర్లకు సవాలే!

తొలి టీ20లో రెండు జట్లూ కలిసి భారీగా పరుగులు సాధించడంతో మరోసారి బ్యాటర్ల ఆధిపత్యం కనిపిస్తుందా? అన్న చర్చ సాగుతోంది. అదే మైదానం, అదే పిచ్‌పై మ్యాచ్ జరగనుండటంతో పరిస్థితులు బ్యాటర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఒక మ్యాచ్ జరగడంతో పిచ్‌పై అరిగిపోయిన భాగాలు బౌలర్లకు కొంత సహకరించవచ్చని తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్.. చివరి వరకు పోరాడినా ఓటమి తప్పించుకోలేకపోయింది. ఈసారి బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని కివీస్ భావిస్తోంది. వరుసగా రెండో ఓటమి ఎదురైతే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తిరిగి పుంజుకోవడం ఆ జట్టుకు కష్టమవుతుంది. ముఖ్యంగా భారత టాప్ ఆర్డర్‌ను త్వరగా కట్టడి చేయడం న్యూజిలాండ్‌కు కీలకం కానుంది.

300వ మ్యాచ్‌లో భారత్ రికార్డు ఏంటి?

అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకు 299 మ్యాచ్‌లు ఆడిన భారత్.. 300వ మ్యాచ్‌తో ఈ ఘనత సాధించిన రెండో జట్టుగా నిలవనుంది. పాకిస్థాన్ 304 మ్యాచ్‌లతో ఈ జాబితాలో ముందుంది. టీమిండియా ఇప్పటివరకు 199 మ్యాచ్‌ల్లో సాధారణ విజయాలు నమోదు చేయగా, సూపర్ ఓవర్, బౌల్ అవుట్ ద్వారా వచ్చిన విజయాలను కలుపుకొని మొత్తం 205 విజయాలు సాధించింది. ఈ చారిత్రక మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్ పట్టుదలగా ఉంది. మరోవైపు స్వదేశంలో సిరీస్‌ను సమం చేయాలంటే న్యూజిలాండ్‌కు ఈ మ్యాచ్ కీలకం. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటాయి.

నమన్ ధీర్ అద్భుతమైన ప్లేయర్

జట్టు ఏం కోరుకుంటుందో అతడికి తెలుసు: కోటక్



భారత యువ ఆల్‌రౌండర్ నమన్ ధీర్‌పై బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ప్రశంసలు కురిపించాడు. జట్టులో తన పాత్ర ఏంటో అతడికి స్పష్టంగా తెలుసని, అందుకు తగ్గట్టుగానే రాణిస్తున్నాడని అన్నాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌తో పాటు చివర్లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉందని, ఇది జట్టుకు సమతూకాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు. న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించడంలో నమన్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 226 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కేవలం 15 బంతుల్లోనే అజేయంగా 42 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. మరో రెండు బంతులు మిగిలి ఉండగానే భారత్ లక్ష్యాన్ని చేరుకుంది. టీ20ల్లో భారత్‌కు ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం. ఈ మ్యాచ్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన కోటక్.. నమన్ ప్రతిభపై విశ్వాసం వ్యక్తం చేశాడు. గత మ్యాచ్‌లో చివరి ఆరు నుంచి ఎనిమిది బంతుల్లో అతడు ఆడిన తీరు తన సామర్థ్యానికి నిదర్శనమని అన్నాడు. "నమన్ చాలా ఆసక్తికరమైన ప్రతిభావంతుడు. అతడు పవర్‌ఫుల్ ఆటగాడు. జట్టు తన నుంచి ఏం ఆశిస్తుందో తెలుసు. దానికి తగ్గట్టుగానే ఆడుతున్నాడు. ఇది చాలా మంచి సంకేతం" అని కోటక్ పేర్కొన్నాడు. ప్రత్యర్థి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉంటే నమన్‌తో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయించవచ్చని, ఎడమ, కుడిచేతి వాటం బ్యాటర్లు సమానంగా ఉంటే ఒకటి లేదా రెండు ఓవర్లు వేయించవచ్చని వివరించాడు. మంచి ఫీల్డర్‌గా, ఫినిషర్‌గా కూడా అతడు జట్టుకు ఉపయోగపడతాడన్నాడు. బ్యాటింగ్‌లో అతడి టెక్నిక్, క్రీజులో నిలదొక్కుకునే విధానం, పవర్, షార్ట్ బాల్స్‌ను ఎదుర్కొనే తీరు ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు. తొలి మ్యాచ్‌లో సంజూ శాంసన్ 33 బంతుల్లో 67 పరుగులు చేయగా, అభిషేక్ శర్మతో కలిసి పవర్‌ప్లేలోనే 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేశాడు. ఒత్తిడిలోనూ భయం లేకుండా సంజూ, అభిషేక్ ఆడిన తీరు తనను ఆకట్టుకుందని కోటక్ తెలిపాడు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో త్వరగా ఔటైతే, మూడో మ్యాచ్‌లోనూ వికెట్ కోల్పోతానేమోనన్న భయం బ్యాటర్లలో ఉండవచ్చని చెప్పాడు. అయినప్పటికీ సంజూ, అభిషేక్ దూకుడుగా ఆడుతూ తమ ఆటపై నియంత్రణ చూపిస్తున్నారని ప్రశంసించాడు. ఇదిలా ఉండగా, గజ్జల్లో గాయం కారణంగా ఇషాన్ కిషన్ రెండో టీ20కి దూరమయ్యాడు. దీంతో 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, అతడికి ఎప్పుడు అవకాశం ఇవ్వాలనే అంశంపై కోటక్ స్పష్టమైన హామీ ఇవ్వలేదు. వైభవ్‌పై తొలి నుంచే ఎక్కువ అంచనాలు పెట్టడం మంచిది కాదని కోటక్ అభిప్రాయపడ్డారు. "అతడు చాలా ప్రతిభావంతుడు. భవిష్యత్తు ఉజ్వలంగా ఉంది. కానీ అందరూ అతడిని ఇష్టపడుతున్నారని, ఆడించాలని కోరుకుంటున్నారని తుది జట్టులో మార్పులు చేయలేం. జట్టులో ఆడే 11 మందినే ఎంపిక చేయాలి" అని అన్నారు. ప్రారంభంలో వైభవ్ ఆడాలంటూ వచ్చిన హైప్ యువ ఆటగాడిపై అనవసర ఒత్తిడి పెంచిందని చెప్పాడు. ప్రస్తుతం అతడు మరింత పరిణతి సాధించాడని, జట్టులోని పోటీని అర్థం చేసుకుంటున్నాడని తెలిపాడు. ఫీల్డింగ్, ఫిట్‌నెస్, బ్యాటింగ్‌పై కృషి చేస్తున్నాడని, సీనియర్ ఆటగాళ్లు ఎలా ఆడుతున్నారో గమనిస్తూ నేర్చుకుంటున్నాడని వివరించాడు. వైభవ్ సహజమైన దూకుడును మార్చే ఉద్దేశం తనకు లేదని కోటక్ స్పష్టం చేశాడు. బంతి పరిస్థితిని బట్టి ఏ షాట్లు ఆడాలో తెలుసుకోవడంపై అతడితో చర్చించినట్లు తెలిపాడు. బంతి ఎక్కడ పడినా షాట్లు సృష్టించేందుకు ప్రయత్నించే ఆటగాళ్లకు భిన్నంగా, వైభవ్ తనకు అనుకూలంగా ఆటను శాసిస్తూ షాట్లు ఆడగలడని ప్రశంసించాడు.



ఏషియన్ పారా గేమ్స్ ప్రపంచ రికార్డుల మోత

100 పతకాల మార్క్ దాటిన భారత్

ఐచి-నగోయా వేదికగా జరుగుతున్న 2026 ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఐదో రోజు మన అథ్లెట్లు ప్రపంచ రికార్డుల మోత మోగించి స్వర్ణాల వర్షం కురిపించారు. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 100 మైలురాయిని దాటింది. షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుతం చేసింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో ప్రపంచ రికార్డు సృష్టించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. చైనా క్రీడాకారిణి కుయిపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ ఆధిక్యంతో మోనా విజయం సాధించింది. అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టీ44 400 మీటర్ల స్ప్రింట్‌లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ పతకంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు. ఇతర క్రీడల్లోనూ భారత్ సత్తా చాటింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్-ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగత్‌ను ఓడించి నితేష్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, ప్రమోద్ రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 5-1 తేడాతో చైనాపై గెలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.

ఆసీస్‌ను ఓడించిన సఫారీలు

టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆశలు సజీవం

గెబెర్హా వేదికగా జరిగిన రెండో టెస్టులో ఆస్ట్రేలియాపై దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్, 31 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ అనూహ్య ఫలితంతో 'వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్' (డబ్ల్యూటీసీ) ఫైనల్ రేసు ఒక్కసారిగా రసవత్తరంగా మారింది. ప్యాట్ కమిన్స్ నేతృత్వంలోని ఆస్ట్రేలియా అగ్రస్థానాన్ని మరింత పదిలం చేసుకోకుండా సఫారీ జట్టు అడ్డుకట్ట వేసింది. దీంతో లండన్‌లోని ఓవల్ మైదానంలో జరగనున్న ఫైనల్ బెర్తుల కోసం పోటీ తీవ్రమైంది. ఓటమి పొందినప్పటికీ ఆస్ట్రేలియా జట్టు 75.00 పర్సంటేజ్ ఆఫ్ పాయింట్స్ (పీసీటీ) తో పట్టికలో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. ఇది 12 మ్యాచ్‌లలో ఆ జట్టుకు కేవలం మూడో ఓటమి మాత్రమే. ఇక ఈ గెలుపుతో దక్షిణాఫ్రికా తన పీసీటీని 66.67 శాతానికి పెంచుకుంది. అయితే, 72.22 పీసీటీతో రెండో స్థానంలో ఉన్న న్యూజిలాండ్‌ను దాటలేకపోయింది. దీంతో ప్రస్తుతం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా తొలి మూడు స్థానాల్లో నిలిచాయి. దక్షిణాఫ్రికా విజయం టీమిండియా ఫైనల్ అవకాశాలను ప్రత్యక్షంగా పెంచకపోయినా, ఆస్ట్రేలియా ఆధిక్యాన్ని తగ్గించడం పరోక్షంగా కలిసొచ్చే అంశం. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న భారత్‌కు ఈ సైకిల్‌లో ఇంకా ఏడు మ్యాచ్‌లు మిగిలి ఉన్నాయి. వీటిలో న్యూజిలాండ్‌తో రెండు, స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టులు ఆడాల్సి ఉంది. ఫైనల్ రేసులో నిలవాలంటే టీమిండియా ఈ మ్యాచ్‌లలో అత్యుత్తమ ప్రదర్శన చేయాలి. మిగిలిన ఏడు టెస్టుల నుంచి కనీసం 62 పాయింట్లు సాధిస్తే, భారత్ పీసీటీ 60 శాతానికి చేరుతుంది. అంటే, ఈ ఏడు మ్యాచ్‌లలో గరిష్టంగా రెండు మ్యాచ్‌లలో మాత్రమే ఓడిపోయే అవకాశం ఉంది. అయితే, ఇతర జట్ల ఫలితాలను బట్టి ఈ సమీకరణాలు మారొచ్చు. గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో ఫైనలిస్టులు 69.44, 67.54 పీసీటీలతో అర్హత సాధించిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. మరోవైపు పట్టికలో నాలుగో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ కూడా రేసులో ఉంది. వారికి ఇంకా ఆరు మ్యాచ్‌లు మిగిలి ఉండగా, వాటిలో నాలుగు స్వదేశంలోనే ఆడనున్నారు. సొంతగడ్డపై పూర్తి ప్రయోజనం పొంది, ఇతర జట్ల ఫలితాలు అనుకూలిస్తే బంగ్లాదేశ్‌కు కూడా ఫైనల్ చేరేందుకు స్వల్ప అవకాశాలు ఉన్నాయి. మొత్తం మీద దక్షిణాఫ్రికా గెలుపుతో డబ్ల్యూటీసీ ఫైనల్ రేసు ఉత్కంఠభరితంగా మారింది. రాబోయే సిరీస్‌లలో జట్ల ప్రదర్శన ఫైనల్ బెర్తులను నిర్ణయించనుంది.

ఫిట్‌నెస్ సాధిస్తే తీసుకుంటామన్నారు

తర్వాత ఫోన్ ఎత్తలేదు.. మెసేజ్‌కు రిప్లై ఇవ్వలేదు: కోహ్లీపై అమిత్ మిశ్రా సంచలన వ్యాఖ్యలు

టీమిండియాలోకి తిరిగి వస్తావంటూ విరాట్ కోహ్లీ హామీ ఇచ్చాడని, పూర్తిగా ఫిట్‌నెస్ సాధించిన తర్వాత తన ఫోన్లు, సందేశాలకు మాత్రం స్పందించలేదని భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా వెల్లడించాడు. అప్పటి కోచ్ అనిల్ కుంబ్లే కూడా గాయం నుంచి కోలుకున్నాక జట్టులోకి తిరిగి వస్తావని భరోసా ఇచ్చాడని చెప్పాడు. అయితే, ఆ హామీలు ఆచరణలోకి రాలేదని పేర్కొన్నాడు. ఆకాశ్ చోప్రాతో కలిసి 'బైట్ అండ్ బోల్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మిశ్రా ఈ విషయాలను వెల్లడించాడు. 2017లో బెంగళూరులో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో గాయపడటం తన అంతర్జాతీయ కెరీర్‌పై ప్రభావం చూపిందని చెప్పాడు. అదే భారత్ తరఫున తనకు చివరి అంతర్జాతీయ మ్యాచ్ అయిందని తెలిపాడు. ఆ మ్యాచ్‌లో కాలికి గాయమైన తర్వాత అప్పటి కోచ్ అనిల్ కుంబ్లేతో మాట్లాడినట్లు మిశ్రా చెప్పాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత జట్టులోకి తిరిగి వస్తావని కుంబ్లే భరోసా ఇచ్చాడని



గుర్తుచేసుకున్నాడు. ఆ తర్వాత కెప్టెన్‌గా ఉన్న విరాట్ కోహ్లీని కూడా సంప్రదించినట్లు తెలిపాడు. ఏం చేయాలని అడిగితే.. పూర్తిగా ఫిట్‌నెస్ సాధించి సిద్ధంగా ఉంటే జట్టులోకి వస్తావని కోహ్లీ చెప్పినట్లు మిశ్రా వెల్లడించాడు. గాయం నుంచి కోలుకున్న తర్వాత కోహ్లీని మళ్లీ సంప్రదించి తన పునరాగమనంపై పరిస్థితి ఏంటని అడిగానని చెప్పాడు. వారం నుంచి పది రోజుల్లో సమాచారం ఇస్తానని కోహ్లీ చెప్పినట్లు తెలిపాడు. అయితే, వారం, రెండు వారాలు, మూడు వారాలు గడిచినా ఎలాంటి సమాధానం రాలేదని మిశ్రా అన్నాడు. "ఫోన్ చేశాను. అతడు ఎత్తలేదు. సందేశం పంపినా స్పందన లేదు. మళ్లీ ఫోన్ చేశాను. అయినా సమాధానం రాలేదు. చివరకు నేనే వదిలేశాను. మనల్ని జట్టులోకి తీసుకోవాలని ఎవరికీ లేకపోతే మనం ఏం చేయగలం?" అని మిశ్రా ఆవేదన వ్యక్తం చేశాడు. తనకంటే తీవ్రంగా గాయపడి, ఎక్కువ కాలం ఆటకు దూరంగా ఉన్న కొందరు ఆటగాళ్లు ఫిట్‌నెస్ సాధించగానే జట్టులోకి తిరిగి వచ్చారని మిశ్రా పేర్కొన్నాడు. కానీ తన విషయంలో అలా జరగలేదని, ఇప్పటివరకు తనకు ఎలాంటి సమాధానం రాలేదని చెప్పాడు.



వరుస ఫ్లాపులొచ్చినా కీర్తి సురేష్‌కు తగ్గని క్రేజ్.. అసలు కారణం ఇదేనా?

సినీ పరిశ్రమలో విజయాలు- అపజయాలు ఒకే నాణేనికి ఉన్న రెండు ముఖాల లాంటివి. అయితే కొన్నిసార్లు సినిమాలు బాక్సాఫీస్ వద్ద వరుసగా బోల్తా పడినా ..నటన పరంగా ఆ స్టార్‌పై ఉన్న ముద్ర కారణంగా డిమాండ్ ఏమాత్రం తగ్గదు. ప్రస్తుతం టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉన్న నటిపై ఇదే చర్చ జరుగుతోంది. కెరీర్ పరంగా ఇటీవల వరుస పరాజయాలు పలకరించినా నటి కీర్తి సురేష్ క్రేజ్ - మార్కెట్ వ్యాల్యూ ఏమాత్రం తగ్గకపోవడం విశేషం. కీర్తి సురేష్ కెరీర్‌ను పరిశీలిస్తే.. గత కొన్నేళ్లుగా కొన్ని వరుస చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో రాణించని విషయం తెలిసిందే. రివాల్వర్ రీటా, బేబీ జాన్, రఘు తాత, ఉప్పు కప్పురంబు, అలాగే మెగాస్టార్ చిరంజీవితో కలిసి నటించిన -భోళా శంకర్- వంటి సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. అయితే వీటిలో చాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశను మిగిల్చాయి. ఈ వరుస పరాజయాల ప్రభావం కీర్తి కమర్షియల్ మార్కెట్‌పై కొంతవరకు పడినా.. నటిగా తన స్థానానికి మాత్రం ఎలాంటి భంగం కలగలేదు. ఫ్లాపులొచ్చినా రివాల్వర్ రీటా పాత్రలో కీర్తి అమాయకత్వం, కర్కశత్వంతో కూడుకున్న నటన అందరికీ నచ్చింది. భోళా శంకర్ లో చిరంజీవి లాంటి అగ్ర నటుడికి సోదరిగా నటించినా అది తనలోని ఆలోచనా వైవిధ్యానికి అద్దం పట్టింది. రివాల్వర్ రీటాలో డార్క్ కామెడీ-యాక్షన్ మేళవించిన పాత్రలో టైమింగ్ ప్రదర్శించిన కీర్తి సురేష్, బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన -బేబీ జాన్-లో ఎమోషనల్ పవర్ చూపిస్తూ విభిన్నమైన షేడ్స్ పండించారు. అదే సమయంలో రఘు తాత చిత్రంలో హిందీ తప్పనిసరి విధింపును ప్రశ్నించే విప్లవాత్మక భావాలున్న.. వ్యంగ్యాత్మక పాత్రలో మెప్పించగా, -ఉప్పు కప్పురంబు-లో ఓ సామాజిక-హాస్య కోణంలో సరికొత్త కథానాయికగా దర్శనమిచ్చారు. ఇలా కథాంశాలు, జోనర్లు పూర్తిగా భిన్నంగా ఎంచుకుని ఆసక్తిని పెంచారు కీర్తి. క్రైమ్ కామెడీ, కమర్షియల్ ఎమోషన్, సామాజిక వ్యంగ్యం, పీరియాడిక్ డ్రామా వంటి ప్రతి పాత్రలోని వైవిధ్యాన్ని స్వయంగా ఆహ్వానిస్తూ.. తన విలక్షణ నటనతో ఆయా సినిమాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



వంగా చేతిలో బాటిల్.. స్పిరిట్ టీజింగ్ వేరే లెవెల్!

ప్రభాస్ బర్త్‌డే సందర్భంగా అభిమానులకు మరో ఆసక్తికరమైన ఫొటో వచ్చేసింది. ఈసారి డార్లింగ్ పక్కన సందీప్ రెడ్డి వంగా కనిపించారు. కిచెన్‌లో బాటిల్ ఓపెన్ చేస్తున్న వంగాను ప్రభాస్ నవ్వుతూ చూస్తున్న ఫొటో అది. దీనికి 'స్పిరిట్స్ ఆర్ హై' అంటూ ఇచ్చిన క్యాప్షన్ మరింత ఆసక్తి పెంచింది. ఇద్దరి మధ్య ఉన్న బాండింగ్ ఒక ఎత్తయితే, ఆ బాటిల్‌తో 'స్పిరిట్' పేరును కనెక్ట్ చేసిన విధానం మరో ఎత్తు. నిజానికి ఈ బాటిల్ వ్యవహారం చూస్తే గతంలో వచ్చిన 'స్పిరిట్' ఫస్ట్ లుక్ గుర్తుకురాకుండా ఉండదు. గాయాలతో నిలబడిన ప్రభాస్ చేతిలో బాటిల్, పక్కన తృప్తి డిమ్రి కనిపించారు. అప్పట్లో ప్రభాస్ పట్టుకున్నది గ్లాసా, బాటిలా అనే కామెంట్స్ కూడా వచ్చాయి. చివరకు అది లీటర్ బాటిల్ అని వంగానే క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు మరోసారి అదే తరహా వస్తువుతో ఇద్దరూ కనిపించడం అభిమానులకు సరదాగా అనిపిస్తోంది. వంగా సినిమాల్లో హీరోల అలవాట్లకు క్రేజీ యాంగిల్ ఉంటుంది. 'అర్జున్ రెడ్డి' నుంచి 'యానిమల్' వరకు ఈ బజ్ హైలెట్ అయ్యింది. హీరో కోపం, ప్రేమ, వ్యసనాలు.. అన్నింటినీ పాత్రలో భాగంగానే చూపిస్తారు. ఇప్పుడు ప్రభాస్‌ను కూడా 'వన్ బ్యాడ్ హ్యాబిట్' ఉన్న పోలీస్ ఆఫీసర్‌గా పరిచయం చేశారు. ఇప్పటికే వచ్చిన పోస్టర్‌లో రఫ్ లుక్ చూపించారు. అసలు ఆ బ్యాడ్ హ్యాబిట్ వెనక ఎలాంటి కథ ఉందనేది మాత్రం ఇంకా బయటపెట్టలేదు. మరోవైపు ప్రభాస్‌కు ఈ సినిమా కెరీర్ పరంగా కూడా ప్రత్యేకమే. 'బాహుబలి'లో రాజుగా, 'సలార్'లో మాస్ హీరోగా, 'కల్కి'లో ఫ్యూచరిస్టిక్ పాత్రలో కనిపించారు. ఇప్పుడు వంగా దర్శకత్వంలో పోలీస్ క్యారెక్టర్ చేస్తున్నారు. 'యానిమల్'లో రణబీర్ కపూర్‌ను పూర్తిగా కొత్తగా ప్రజెంట్ చేసిన వంగా, ప్రభాస్‌తో ఎలాంటి ప్రయోగం చేస్తున్నారనే అంచనాలు ఉన్నాయి. ముఖ్యంగా స్టార్ ఇమేజ్‌కు తగ్గ ఎలివేషన్స్‌తో పాటు పాత్రలోని నెగటివ్ షేడ్స్‌ను ఎలా చూపిస్తారనేది ఆసక్తికరం.

ఛాన్సులు వచ్చినా ఏ లాభం!!

ఒక్క హిట్ తో హీరోయిన్ కు వచ్చే క్రేజ్ అంతా ఇంతా కాదు. వరుసగా పెద్ద సినిమాల్లో ఛాన్సులు కూడా వస్తాయి. కానీ, ఆ అవకాశాలను ఎంతవరకు యూజ్ చేసుకున్నారన్నదే కెరీర్ లో ఇంపార్టెంట్. సినిమాలో స్టార్ హీరో పక్కన కనిపించినంత మాత్రాన సరిపోదు. తన రోల్ కూడా ప్రేక్షకులకు గుర్తుండాలి. ఇప్పుడు యంగ్ హీరోయిన్ కయాదు లోహార్ కెరీర్ ను చూస్తే అది క్లియర్ గా కనిపిస్తోంది. మోడలింగ్ తో కెరీర్ స్టార్ట్ చేసిన కయాదు.. తక్కువ సమయంలోనే సౌత్ సినిమాల్లో మంచి అవకాశాలు అందుకుంది. కన్నడ, మలయాళ సినిమాలతో నటిగా గుర్తింపు తెచ్చుకున్న ఆమె.. తెలుగులో 'అల్లూరి'తో పరిచయమైంది. ఆ తర్వాత తమిళంలో వచ్చిన 'డ్రాగన్' సినిమాతో మరింత క్రేజ్ సంపాదించింది. దీంతో స్టార్ హీరోల సినిమాల్లో నటించే అవకాశాలు కూడా ఆమెకు వచ్చాయి. అయితే, అవకాశాలు రావడం ఒకటైతే.. వాటితో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం మరో విషయం. నాని హీరోగా నటించిన 'ది ప్యారడైజ్'పై కయాదు చాలా ఆశలు పెట్టుకుని ఉండొచ్చు. కెరీర్ కు పెద్ద ప్లస్ అవుతుందని భావించి ఉండొచ్చు. కానీ, ఆ సినిమా విడుదలయ్యాక ఆమె పాత్రపై విమర్శలు వచ్చాయి. సుబ్బలక్ష్మి రోల్ చూపించిన విధానం, ఇచ్చిన ఇంపార్టెన్స్ పై జోరుగా చర్చ జరిగింది. కొన్ని సీన్స్ విషయంలోనూ ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సినిమాతో రావాల్సిన గుర్తింపు కంటే, పాత్ర చుట్టూ వచ్చిన విమర్శలే ఎక్కువగా కనిపించాయి. ఒక హీరోయిన్ కు సినిమాలో ఎంతసేపు కనిపించామన్నది ముఖ్యం కాదు. కనిపించినంతసేపు కథకు ఎంత ఉపయోగపడ్డాం అనేదే మెయిన్. పాత్రకు సరైన బ్యాక్ డ్రాప్ ఉండాలి. కథలో తనకంటూ ఇంపార్టెన్స్ ఉండాలి. ముఖ్యంగా ప్రేక్షకులు ఆ పాత్రతో కనెక్ట్ అవ్వాలి. ఇవి లేకపోతే ఎంత పెద్ద సినిమా చేసినా అనుకున్న రిజల్ట్ రాకపోవచ్చు. కయాదు విషయంలో ఇప్పుడు ఇదే చర్చ జరుగుతోంది. అయితే విమర్శలతో కయాదు కెరీర్ డౌన్ అయినట్లు కాదు. ఆమె చేతిలో ఇంకా ఇంట్రెస్టింగ్ సినిమాలు ఉన్నాయి. సూర్యతో చేస్తున్న సినిమా, మారి సెల్వరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మంజనాతి' వంటి ప్రాజెక్టులు ఆమెకు ఉపయోగపడొచ్చు. ఆ సినిమాల్లో మంచి పాత్రలు దక్కితే నటిగా తనను తాను నిరూపించుకునే అవకాశం ఉంటుంది. రామ్ చరణ్, సుకుమార్ సినిమాల్లోనూ ఆమెకు అవకాశం ఉందనే ప్రచారం వినిపిస్తోంది. దీనిపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.





నేషనల్ క్రష్ పాన్-ఇండియా ఇమేజ్‌ను దెబ్బతీసే కుట్ర?

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఏ చిన్న వ్యాఖ్య చేసినా? ఏ కొత్త ప్రాజెక్ట్‌లో కనిపించినా సోషల్ మీడియాలో సంచలనంగా మారడం సహజం. ఇటీవల అమ్మడు హిందీలో మాట్లాడిన తీరు ఉపయోగించిన యాసపై నెట్టింట ట్రోలింగ్ నడిచింది. అయితే ఈ ట్రోలింగ్ కేవలం సాధారణ నెటిజన్ల విమర్శ మాత్రమేనా లేక దీని వెనుక ఏదైనా పక్కా వ్యూహం ఉందా? అనే సందేహాలు టాలీవుడ్, బాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా కన్నడ చిత్ర పరిశ్రమలోని కొందరు వ్యక్తులు కావాలనే రష్మికను లక్ష్యంగా చేసుకుని ఈ తరహా దుష్ప్రచారానికి పాల్పడుతున్నారనే ప్రచారం తెరపైకి వస్తోంది. రష్మిక మందన్న కన్నడ చిత్రం -కిరిక్ పార్టీ- తో వెండితెరకు పరిచయమైనా? ఆ తర్వాత అమ్మడు టాలీవుడ్, బాలీవుడ్‌లలో సాధించిన సక్సెస్ కొందరికి రుచించలేదనేది బహిరంగ రహస్యం. గతంలో కన్నడ ప్రొడక్షన్ హౌస్‌లపై రష్మిక చేసిన కొన్ని వ్యాఖ్యలు.. కాంతార సినిమా వీక్షణపై ఇచ్చిన వివరణల వల్ల కన్నడ నాట ఆమెపై కొంత వ్యతిరేకత వ్యక్తమైంది. ఆ సమయంలో రష్మిక సినిమాలను కన్నడలో బ్యాన్ చేయాలనే డిమాండ్లు కూడా వచ్చాయి. ఆ పాత కోపాన్ని మనసులో ఉంచుకుని అమ్మడి పాన్-ఇండియా ఇమేజ్‌ను దెబ్బతీయడానికే హిందీ యాసను ఆసరాగా చేసుకుని ట్రోల్స్ చేయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భాషా సరిహద్దులు దాటి బాలీవుడ్‌లో వరుస బడా ప్రాజెక్ట్‌లు దక్కించుకుంటున్న రష్మిక అక్కడ తన సొంతంగా డబ్బింగ్ చెప్పుకోవడానికి ప్రయత్నిస్తోంది. ఏ దక్షిణాది నటుడికైనా హిందీ ఉచ్చారణలో కొంత మాతృభాషా ప్రభావం ఉండటం సహజమైన విషయం. అయితే రష్మిక హిందీ ఉచ్చారణను నెగెటివ్‌గా చూపిస్తూ సోషల్ మీడియాలో మీమ్స్, రీల్స్ ప్రచారం కావడం వెనుక పెయిడ్ పీఆర్ బ్యాచ్‌లు పనిచేస్తున్నాయనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా జరిగే విమర్శకు.. కావాలని చేసే నెగెటివ్ క్యాంపెయిన్‌కు స్పష్టమైన తేడా కనిపిస్తోందన్న వాదన తెరపైకి వస్తోంది.

Printed, Published and Owned by : GUNDAGONI LINGAIAH and Printed at MANASA PRINTERS, H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001 . and Published at Manasa Publication H.No. 7-848/3,Srinagar Colony,Panagal Road,Nalgonda-508001. Editor: GUNDAGONI LINGAIAH RNI.No. TELTEL/2013/58044. Cell : 9848457689. gundagoni@gmail.com CEO: KANDHULA VENKATARAMANA